ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 31, 2010

Entered

దేశం నిండుగ దీపాల పండుగ

హ్యాపీ బర్త్‌డే

(2010 అక్టోబర్ 31 నుంచి 2010 నవంబర్ 6 వరకు)

అక్షిత
అక్టోబర్
మమత-అరుణ్ కుమార్
బంజారాహిల్స్-హైదరాబాద్

హెచ్.నితిన్
అక్టోబర్
మాధవి-వెంకటేష్
తక్కళ్లపల్లి-రంగారెడ్డి

జె.మనీష్
అక్టోబర్
లక్ష్మి-శ్రీనివాస్
హెచ్.బి.కాలనీ-విశాఖపట్నం

అక్షిత్
అక్టోబర్
చందన-కృష్ణంరాజు
నాగారం-రంగారెడ్డి

కె.రాధాకృష్ణ
అక్టోబర్31
వనజ-గంగాశ్రీనివాస్
మెట్టుపల్లి-కరీంనగర్

ఆన్య
అక్టోబర్
అశ్విని-ప్రదీప్‌కుమార్‌రెడ్డి
హైదరాబాద్

దినేష్ కార్తీక్
అక్టోబర్
మంజుల-నరేష్
వర్ధన్నపేట-వరంగల్

ఎమ్.సాయిలక్ష్మి
నవంబర్2
సుజాత-నాగేందర్‌రావు
ములకలపల్లి-ఖమ్మం

ఆర్.నవతేజ్
నవంబర్3
రమాదేవి-నరసింహారావు
హైదరాబాద్

ఎ.నర్మద
నవంబర్4
లలిత-శేషగిరిరావు
ములకలపల్లి-ఖమ్మం

ENTERED

మనలో మాట

కుశలమా?

అంతా క్షేమమేనా? కుశలమేనా? అని ఒకప్పుడు ఉత్తరాల్లో పరామర్శించినా; ఎలా ఉన్నారు? బాగున్నారా? అని మౌఖికంగా ఇప్పుడు పలకరించినా సారాంశం ఒక్కటే! అది బాగోగుల గురించి ఆరా తీయడం. చిరకాల మిత్రులో, బంధువులో, పెద్దలో అలా పలకరించినప్పుడు ఆత్మీయత తొంగిచూస్తుంది. బాధను పంచుకొని బరువుని తగ్గించినట్టూ, సంతోషాన్ని షేర్ చేసుకొని ఆనందాన్ని హెచ్చించినట్టూ ఉంటుంది. పలకరింతలకూ, పరామర్శలకూ ఆదికాలంనుంచీ అంత సీను ఉంది కాబట్టే- నేటి యాంత్రికయుగంలోనూ ఒక 'యాత్ర'లా సాగుతోంది!

ఒకప్పుడు మనం రాసుకున్న ఉత్తరాల్లో మొదటి నాలుగు వాక్యాలూ కుశల ప్రశ్నలే! రాన్రానూ అవి ఎంత రొటీన్‌గా మారిపోయాయి అంటే- అర్థంతో సంబంధం లేకుండా రాసుకుపోయేదాకా! 'ఇక్కడంతా క్షేమము. మీరంతా క్షేమమని తలచుచున్నాము.' అని ప్రారంభించిన ఉత్తరంలో- ఆ వెనువెంటనే- 'ముఖ్య విషయాలు ఏమనగా... అమ్మ ఆరోగ్యం బాగుండడం లేదు. నిన్ననే ఆసుపత్రిలో చేర్చాం. వీధి చివర కాలువలో పడ్డం వల్ల మన కుక్క కాలు విరిగింది.' అన్న సమాచారమూ ఉండేది. పలకరింపులు అన్నిసార్లూ ఆనందాన్నే కలిగించవు. కొన్నిసార్లు అన్వార్థ, అపార్థ కారకాలు కూడా అవుతాయి. 'బావా, ఎప్పుడు వచ్చితీవు?' అని కృష్ణుడు నోరారా పలకరిస్తే- దుర్యోధనుడి మనసు పులకరించలేదు. అగ్గిమీద గుగ్గిలంలా మండింది.

సమస్యలతో సతమతం అయ్యేవాళ్లు మహజర్లు పట్టుకొని రాజాస్థానాలను మొరపెట్టుకోవడం రాచరికాల నాటి పద్ధతి! ప్రజాస్వామ్యయుగంలోనూ అదే ఒరవడి కొనసాగడం తిరోగతికి ఒక తార్కాణం. ఎన్నికల వేళ మాత్రం పాలకులు ఇంటింటికీ వెళ్లి పలకరిస్తారు. ఆ పలకరింపు ఆశించే ప్రతిఫలం ఏమిటో మనకు తెలుసు! ఒరిస్సా గిరిజన పల్లెలను రాహుల్‌గాంధీ పలకరించినా, జగన్ రాష్ట్రాన్ని చుట్టేసి ఓదార్చుతున్నా-ఆ వెనక పదవే పరమార్థం! సింహాసనాలు ఎక్కాక ఏంచేస్తారో మనకు తెలియంది కాదు కదా! వాడల్లోకి, జనంలోకి వెళ్లి వాళ్ల సాధకబాధకాలు తెలుసుకోవడం, ఉమ్మడి బాధలకు కారణమేంటో వివరించి, కలసికట్టుతనం నేర్పడం తొలినుంచీ కమ్యూనిస్టులకే చెల్లింది.

కొంతమంది మనుషుల్నే కాదు; చుట్టూ ఉన్న చెట్లనీ, పిట్టల్నీ, రాళ్లగుట్టల్నీ కూడా పలకరించి పరవశిస్తారు. పూలబాలలను పలకరించి, వాటి బాధను తన బాధగా పలవరించాడు కరుణశ్రీ. తమ బాగోగుల గురించి అడిగేవాళ్లెవరూ లేరని గబ్బిలానికి ఏకరువు పెట్టాడు జాషువా. రాయబారానికి మబ్బులు, హంసలే పనికొస్తాయా అంటూ నిలదీశాడు. చిలకనో, గోరింకనో అడ్డుపెట్టి కుశల సమాచారం రాబట్టుకుంటారు సినీ ప్రేమికులు. 'చిలుకా క్షేమమా?' అని పాడుకున్నా, పెరటి జాంచెట్టు చేత కుశలం అడిగించినా సినిమావాళ్లకే చెల్లుతుంది.

కొంతమంది కుశలం అడుగుతారు. అవతలివాళ్లు సంబరపడి చెబుతుంటే- వీళ్లు ఇంకొక టాపిక్‌లోకి మారిపోతారు. అడగడమే తప్ప ఆలకించరు. ఆలకించినా గుండెదాకా చేర్చి గుర్తు పెట్టుకోరు మరికొందరు. మనం పిల్లల చదువులు, ఉద్యోగాలు ఇలా ఏం చెప్పినా కనులెగరేస్తూ తలాడిస్తూ శ్రద్ధగా వింటారు. నెల తర్వాత మళ్లీ కలిస్తే ఇవే విషయాలు మళ్లీ అడుగుతారు. ఎన్నేళ్లయినా ఎప్పుడూ ఫ్రెష్‌గా వినడం తగిన హావభావాలు ప్రదర్శించడం గొప్ప కళే మరి. దేశం, భాష, జాతి అనే వాటితో సంబంధం లేకుండా- మనిషిని మనిషినీ కలిపేదీ, మనసు పొరను తాకేదీ 'బాగున్నావా?' అన్న మాట. అదొక రాజకీయ యాత్రగానో, యాంత్రిక పరామర్శగానో కాక- స్వచ్ఛమైన పలకరింపుగా పరిమళిస్తే... ఎంత బాగుంటుంది! ప్చ్... ★

ఈ సంచికలో....

టపా	...	2
దీపావళి కార్టూన్లు	...	3
ఈ పేజ్	...	8
కవిత్వమ్	...	9
సీరియల్	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
కథ	...	18
కొత్త పుస్తకాలు	...	20
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

'అమ్మ' ఆదర్శం

సినిమా ... 6

విజయాల వేటలో రూటు మార్చిన రజనీ

జ్ఞాపకం ... 21

అమృతం ఘాటు



తల్లిదండ్రులు చదవాల్సినది

ఆదివారం స్నేహలో ఈ బుక్ ఈజీ క్లిక్ వ్యాసం చాలా ఆసక్తికరంగా ఉంది. కంప్యూటర్ ద్వారా ఈ బుక్‌ను అందరు చదవొచ్చు. కొన్ని వేల పేజీలను మనం ఇందులో చదవొచ్చని తెలుసుకొన్నాం. ప్రపంచంలోని అన్ని భాషలు ఇందులో ఉంటాయి. సుందర సీమ సియోల్ గురించి విపులంగా తెలుసుకొన్నాం. అక్కడి వాతావరణం, ప్రదేశాలు చాలా రమ్యంగా ఉంటాయి. సుందర పర్వతాలు, సియోల్ టవర్, సిటీ హాల్, హోటల్స్, హన్ నది, ఫోక్ మ్యూజియం పర్యాటకుల పాలిటి కల్పవృక్షం. వ్యాపారులకు అనువైన ప్రదేశం ఈ సియోల్. వికాసంలో చిన్నారుల కోరికే అలవాటు గురించి ప్రతి తల్లిదండ్రులు చదవ దగినది. పిల్లలతో ఈ అలవాటు మాన్పించటమెలాగో ఈ వ్యాసం ద్వారా తెలుసుకొన్నాం. ప్రపంచ పొట్టి వ్యక్తి చాలా వండర్. మానవుల్లో అతి వింతైన వారు ఈ పొట్టివారు. ఈ పొట్టితనం శరీరానికేగాని మనస్సుకు కాదు. అందుకే అంటారు పొట్టివారు చాలా గట్టివారని. అందుకే ఈ వారం పొట్టి వ్యక్తికీ జయహో...

డి. వై .రాజు, గణపవరం.

శంకరన్ గురించి ఇవ్వడం బావుంది

ప్రభుత్వ ఉన్నత ఐఎఎస్ అధికారి అయివుండి పీడితుల పక్షపాతి ఐన అధికారి శంకరన్ గురించి ఇంటర్వ్యూ ఇవ్వడం బావుంది. ఆయన గురించిన పలు విషయాలు తెలుసుకున్నాం. మళయాళి బ్రాహ్మణుడైన ఐఎఎస్ అధికారి పిఎస్ కృష్ణన్ అడుగు జాడలో నడిచారు శంకరన్. ఆయన నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన రెండు సంవత్సరాలలో ల్యాండ్ ఎసైన్‌మెంట్ పాలసీని సమర్ధవంతంగా అమలుచేసి.... వేలాది దళిత వెనుకబడిన కులాల పేదలకు భూమి పంపిణీ చేశారని తెలుసుకున్నాం. ధన్యవాదాలు.

శ్రీరామమూర్తి, గాజువాక.

సస్పెన్స్‌తో చదివిస్తున్న 'ట్రాయ్'

10.10.10 నాడు వెలువడిన స్నేహ బావుంది. నగ్నంగా మాట్లాడడం నా హాబీ కవితా చాలా బాగుంది. వియత్నాం వీరుడు ఎన్‌గుయేన్ వాన్‌ట్రాయ్ సీరియల్ సస్పెన్స్‌తో చదివిస్తోంది. 'స్వర్ణయుద్ధం' కథ సందేశాత్మకంగా ఉంది. చదివించింది.

మోతి మోహనరంగా, సూర్యాపేట.

ఆకట్టుకొన్న శ్రీశైల విశేషాలు

'శ్రీశైలక్షేత్రంలో ఎన్ని విశేషాలో' బాగా అలరించింది. క్షేత్రానికి సంబంధించిన విషయాలతోబాటు అక్కడి చారిత్రాత్మక ప్రదేశాలు, గుహలు, దేవాలయం, నందీశ్వర, మల్లిఖార్జున, శ్రీశైలం, భ్రమరాంబిక ఆలయాలు చూసి తరించవలసిందే. హైదరాబాద్, కల్వకుర్తి, అచ్చంపేట మీదగా శ్రీశైలానికి రహదారి వున్నా రైలు మార్గం లేని లోటు కన్పిస్తోంది. ఈ రైలు మార్గం నిర్మిస్తే శ్రీశైలం హైద్రాబాద్‌కు చాల దగ్గర అవుతుంది.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డి అన్నారం.

'రుణం' బావుంది

కేంద్ర ప్రభుత్వం నియమించిన ఐ.ఎ.ఎస్ అధికారులు పాలకుల పక్షానే వుంటారని ఇంతవరకు నాలో వున్న భావన. కాని ఇప్పుడు మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్ గారి మాటల్లో శంకరన్ గురించిన తన అనుభవాలు చదివాక నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను. ఐ.ఎ.ఎస్. అధికారులకు మార్గదర్శి అయిన పి.యస్. కృష్ణన్ గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఈ వ్యాసం ఉపయోగపడింది. మన సమాజంలో పెట్టుబడిదారులు తమ సరుకును అమ్ముకోడానికి ముఖ్యంగా ఆడవాళ్ళను భ్రమలలోకి తీసికెళతారు. లేనిపోని సంస్కృతులను తెచ్చిపెడతారు. ఎలాగైనా ఖర్చులకు అలవాటుపడేలా చేస్తారు. దీన్ని "రుణం" కథలో చక్కగా చూపించారు. ఈ రోజులలో ఆడవాళ్ళు కొద్దో గొప్పో చదువుకుంటున్నారు. వీరు మహిళా సంఘాలతో సంబంధాలు పెట్టుకోవాలి. ఇటువంటి రుణాలు



గురించి రాస్తున్న ప్రజాశక్తి పేపరు చదివితే గొప్పలకిపోయి, అప్పులకి వెళ్ళరు. ఆత్మహత్యలకు పోరు.

ఇలిపిళ్ళ సూర్యనారాయణ. భీమనవారిపేట, విజయవాడ.

భళా! శిష్యా భళా!!

గడ్డం గురువును వదిలించుకొని, వెళ్ళిన శిష్యుని మాట బాగుంది. వంటకాలు.... బొబ్బట్లు, కొబ్బరి కోవా, సొరకాయ హల్వా, ఖర్జూర పండ్ల కేక్ అన్నీ రుచికరాలే. ఢిల్లీ పక్షుల ఆసుపత్రిలా కనీసం మనుషుల ఆసుపత్రి ఉండాలి. అన్ని రుచుల సియోల్‌ను ఒకసారి చూడగలమా? 'ఈ బుక్' కథాకమామీషు బాగుంది. కోరికే అలవాటును మొగ్గలోనే తుంచాలనడం బాగుంది. అగ్గిపెట్టె బోటు అందరికీ వినోదమే. మాటలకోటలో పదిమంది విజేతల పేర్లు వేయండి సార్.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్.

★

మార్క్సిజం లింక్స్ .....

మార్క్సిజంలోని వివిధ విషయాల గురించిన వందలాది వెబ్ సైట్ల వివరాలకోసం www.marxismlinks.blogspot.com ను దర్శించండి. ఈ సైట్‌ని మీ డెస్క్‌టాప్ మీద డౌన్‌లోడ్ చేసుకొని సమయం వృధా కాకుండా మార్క్సిజం గురించి వేలాది లింకులతో లక్షలాది పేజీలను మీ మౌజ్ క్లిక్ ఆధీనంలోకి తెచ్చుకోవచ్చు.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేదైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.


ఇంకెప్పుడూ దీపావళి కవితలు వినిపిస్తానని వెంటపడవుగా...?!
దీపావళి కవితల పోటీలు
శేఖర్.

లంచం
FILES
శేఖర్.

టపాసులంటే భయం కాదోయ్!
అందరూ టపాసులు కాల్చుతుంటే...
చేతులు కాలిన వాళ్ళకి కట్లెవరు కడ్తారు?
అందుకనే కాల్చనోయ్!!!
శేఖర్

బాంబు అంటిస్తుంటే... ఇన్సూరెన్స్ పాలసీ చేయమని
అడగటంలో నీ ఉద్దేశ్యం?
శేఖర్.


CRACKERS
DIVAL
ఒక్కటి కూడా సరిగ్గా రవ్వలు రావటం లేదయ్యా
దీపావళి టపాసుల సేల్
ఇచ్చట చిచ్చుబుడ్లు దొరుకును
శేఖర్

తపోభంగమునకు రంభను పంపనవసరం లేదు! దీపావళి సీజనే కదా
పెద్ద వంకాయ బాంబును అంటించవయ్యా చాలు!
శేఖర్.


యోగవిద్య కాదు... నా పిండాకూడు కాదు!
నా కిందెవడో తుంటరి శిష్యుడు బాంబు పెట్టాడు..!
శేఖర్.


మా తమ్ముడు భూచక్రాలూ...
నేను విష్ణుచక్రాలూ కాల్చుకున్నాం...
శేఖర్.

స్ఫూర్తి

-నర్రా రాఘవరెడ్డి
సిపిఎం సీనియర్ నాయకులు,
మాజీ ఎమ్మెల్యే

'అమ్మ' ఆదర్శం

నేను ఎన్నో పుస్తకాలు చదివినా మక్సీమ్ గోర్కీ రచించిన 'అమ్మ' పుస్తకం నాకు ఎంతగానో ప్రేరణనిచ్చింది. ఎందుకంటే కార్మికుల స్థితిగతులతో పాటు సమస్యల పరిష్కారానికి పోరాట పటిమ అందులో ఉట్టి పడుతోంది. కొడుకు పోరాటాన్ని పరిశీలిస్తూనే అమ్మ పోరాట మార్గం పట్టడం, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను వారి పరిశ్రమల్లోనే పంచడం వంటివి పోరాట స్ఫూర్తిని రగిలిస్తాయి. ఈ పుస్తకం నాకు కార్మికుల పక్షాన ఎలా పోరాడాలో నేర్పింది. కాని నేను కార్మికులతో పాటు ఎక్కువగా రైతులు, వ్యవసాయ కార్మికుల కోసం ప్రజా పోరాటాలు చేయాల్సి వచ్చింది. చిన్నతనంలోనే మా అమ్మ చనిపోయినా నా పోరాట జీవితానికి మక్సీం గోర్కీ 'అమ్మ' మార్గం చూపింది. కార్మికుల సమస్యలపై పోరాటాలు నడిపేందుకు స్ఫూర్తినిచ్చింది. దానితో పాటు వ్యవసాయ కార్మికులు, కూలీల పక్షాన నిలబడేందుకు మార్గం చూపింది. పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు ఎలా కాపాడుకోవాలో నేర్పింది. నాయకులు నిర్బంధానికి గురైనప్పుడు నడుస్తున్న ఉద్యమాన్ని ఆగకుండా ముందుకు తీసుకెళ్లడానికి కావాల్సిన ఎత్తుగడలకు ప్రేరణగా నిలిచింది.

అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమంటే 'అమ్మ' అ నుంచి క్ష వరకూ కార్మిక వర్గ నవల. పెట్టుబడిదారీ విధానం తొలి దశలో ఫ్యాక్టరీలు కార్మికుల రక్త మాంసాలను ఎలా పీల్చి పిప్పి చేశాయో చెబుతుంది. పుస్తకం ప్రారంభమే ఫ్యాక్టరీ కూతతో మొదలవుతుంది. గొడ్డుచాకిరీ కార్మికుల జీవితాలను యాంత్రికం చేస్తుంది. వ్యసనాలకు బానిసగా మారుస్తుంది. 'అమ్మ' కథానాయకుడుగా ప్రపంచంలో కోట్లాది మందికి ప్రేరణ నిచ్చిన పావెల్ పాత్ర ప్రతివారికి గుర్తుంటుంది. కాని కార్మికుడుగా చాకిరీ చేసి మొద్దుబారిపోయి తాగుబోతుగా మారిన అతని తండ్రి వర్గ నేపథ్యం దాని వెనక వుంది. తండ్రి తల్లిని రోజూ బాధిస్తుంటే బాదుతుంటే అడ్డుపడిన పావెల్ తర్వాత తనూ అలాగే తయారవుతాడు. అప్పుడు అమ్మ బాధపడుతుంది. కాని కొద్ది కాలంలోనే అతను మారతాడు. నాన్న బాట తొక్కకుండా నవ్యమార్గం చేపడతాడు. తనతో పాటు అమ్మను కూడా అద్భుతమైన కామ్రేడ్‌గా మారుస్తాడు.

నా జీవితంలోనూ బాల్యంలోనే అనేక ఒడుదుడుకులు ఎదుర్కొన్నాను. అమ్మ పోయిన తర్వాత పెంపుడు తలిదండ్రుల దగ్గర చాలా కాలం పెరిగాను.ఆ తర్వాత మళ్లీ అసలు తండ్రి దగ్గరకు చేరినా ఆయన దగ్గర గాని, సవతి తల్లి దగ్గర గాని నేను పెద్దగా ఆదరణ పొందలేదు. నా ఆలనా పాలనా చూసే వారు లేకపోవడంతో తెలిసిన వారు బొంబాయి (నేటి ముంబాయి)కి వెళ్తుంటే వారితో పాటు నేను కూడా వలసబాట పట్టాను. అది భారత దేశంలో పెట్టుబడిదారీ విధానపు తొలి కేంద్రాల్లో ఒకటని అందరికీ తెలుసు. అక్కడ టెక్స్‌టైల్స్ మిల్లులో 20ఏళ్ల పాటు కార్మికుడిగా పని చేశాను. నాకు ఒక రకంగా రాజకీయంగా అక్కడే ఎక్కువ శాతం ఆసక్తి పెరిగిందని చెప్పాలి. బట్టల మిల్లులో పని చేస్తూనే నేను అక్కడ 'లాల్ బావుటా' అనే కార్మిక సంఘంలో సభ్యుడిగా ఉన్నాను. అక్కడ మా గ్రామం వారు, నాకు తెలిసిన వారు ఎంతో మంది వివిధ వృత్తుల్లో కార్మికులుగా జీవితం గడుపుతుండేవారు. వారి కష్టసుఖాలను ఆ చిన్న వయస్సులోనే నేను పరిశీలనాత్మకంగా చూడగలిగాను. సరిగ్గా ఈ సమయంలో మా సొంత గ్రామానికి తిరిగి రావాలని ఉత్తరం వచ్చింది. ఇక అక్కడ ఉండడం నా వల్ల కాలేదు. దీంతో కొంతకాలం తర్వాత నా సొంత ఊరైన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం వట్టిమర్తికి తిరిగొచ్చాను. ఇక్కడ రైతులు, వ్యవసాయ కార్మికులు బడా రైతులు, భూస్వాములు, దొరల చేతుల్లో బానిసలుగా బతకడం, తక్కువ కులాల వారిని నీచంగా చూడడం నన్ను బాధించింది. ఇది చాలా అన్యాయంగా తోచింది. అందరూ మనుషులే అయినప్పుడు కులాల పేరుతో నీచంగా చూడడం, పని చేసే వారికి కూటికెళ్లక కడుపు మాడ్చుకుంటుంటే, ఏ పనీ చేయని వారు 'దొరలం' అనే పేరుతో పేదల శ్రమను దోచుకుతినడం నాకు నచ్చలేదు. నేను బొంబాయి నుంచి వచ్చే నాటికి ఇక్కడ కమ్యూనిస్టులపై నిర్బంధం తీవ్రంగా ఉంది. నేను కమ్యూనిస్టు ప్రజా సంఘాల్లో సభ్యునిగా చేరాను. అయితే ఇక్కడి వరకు నేను కార్మికుల కష్టాలు, విన్నాను, చదివాను, చూశాను. కాని ఇక్కడ నేను రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడాల్సి వచ్చింది. రైతుల కోసం ఆ రోజుల్లో బంజరాయి భూముల్ని గుర్తించి రెండు లక్షలకు పైగా ఎకరాల భూముల్ని గుర్తించి, దున్ని రైతులకు పంచాము. రైతాంగ సమస్యల పరిష్కారానికి, అధ్యయనానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చింది. అంటే పుస్తకాలతో పాటు ప్రజలతోనే ఎక్కువ సమయం గడిపేవాళ్లం. ఇలా రైతాంగ సమస్యలపై భూస్వాముల దోపిడీపై పోరాటాలకు పదును పెట్టాం. నాకు కళలపై మక్కువ ఎక్కువ. నాటకాలు, పాటలు, ఆటలు అంటే మహా ఇష్టం. ఈ సమయంలో ప్రజలకు వారి కష్టాలను, పెట్టుబడిదారీ పాలక ప్రభుత్వం పేదలను ఏ రకంగా దోచుకుంటుందో కళలు, ఉపన్యాసాల ద్వారా వివరించేవారం. ఈ పద్ధతిలో వ్యవసాయ కార్మికులు వారి కష్టాలకు కారకులను తొందరగా గుర్తించేవారు. సమస్య పరిష్కారానికి పోరాటాలకు సిద్ధంగా ఎర్రజెండాతో కదిలేవారు. ఇదే సమయంలో కమ్యూనిస్టు పార్టీలో విభేదాలు ఏర్పడి 1964లో పార్టీ రెండుగా చీలింది. ఈ

నేపథ్యంలో సిపిఐ విధానాలను వ్యతిరేకించి నేను సిపిఐఎం పక్షాన నిలిచాను. చాలా వరకు కార్యకర్తలను కూడా ఈ వైపు మరల్చగలిగాను. కళలు, ఉపన్యాసాల ద్వారా ప్రజల్లోకి కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా తీసుకెళ్లగలిగాం. అలాగే అప్పుడున్న పరిస్థితుల్లో ఇతర పార్టీల పని పద్ధతులు, సిద్ధాంతాలు వివరంగా చెప్పేవారం. గ్రామాల్లో ప్రచారం నిర్వహించేప్పుడు కొంత మంది కార్యకర్తలు పార్టీ కోసం ఇంటినుంచే సద్దిబువ్వ కట్టుకొని ఇతర గ్రామాల్లో ప్రచారం నిర్వహించేందుకు వచ్చి సాయంత్రం వరకు ప్రచారం నిర్వహించి తిరిగి ఇంటికెళ్లేవారు. మరికొందరు ప్రచారం నిర్వహించి ఆకలేసినప్పుడు ఆ ఊళ్లో ఏదో ఒక ఇంట్లో అన్నం తినేవారు. ప్రజలు కూడా నాయకుల ఆకలి తీర్చి చాలా సంతృప్తి చెందేవారు. నాయకులు ఇలా తిరిగి ప్రచారానికి వచ్చేవారు. అలా చాలా కాలం వరకు ఇల్లు వదిలి పని చేసిన రోజులున్నాయి. అలా ఆ రోజుల్లో ఎందరో కార్యకర్తలు పని చేసి పార్టీని నిలబెట్టారు. అంతేకాదు! పార్టీకోసం పని చేసేందుకు అన్నీ వదులుకొని ముందుకు వచ్చేవారు. కాని వారికి ఆ రోజుల్లో చదువు లేదు. చదువు వుంటే మరింత బాగుండేదనిపించేది. కాలక్రమంలో చదువుకున్న వారిపై కొన్ని పనులు నమ్మకంగా వదిలేసినా అవి చేయలేకపోవడంతో నా అభిప్రాయం మార్చుకున్నాను. మనస్ఫూర్తిగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసేవారికి చదువుతో పనిలేదు. ఇది 'అమ్మ' పుస్తకం చదువుతున్నప్పుడు కూడా బోధపడింది. 'అమ్మ' వంటి పుస్తకాలు చదివిన తర్వాత సాహిత్యంపై మక్కువ పెరిగింది. అమ్మ పుస్తకంలో కొడుకు పెట్టుబడిదారుల చేతుల్లో బంధీగా పట్టుబడ్డప్పుడు... ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసం, పార్టీ కదలికలు చెదిరిపోకుండా పార్టీ కార్యక్రమాలను కరపత్ర రూపంలో తీసుకెళ్లిన పద్ధతి మాకు స్ఫూర్తిగా నిలిచింది. చిన్నతనంలో అమ్మానాన్నల ప్రేమకు నోచుకోక ఒంటరిగా జీవనం సాగిస్తున్న నన్ను 'అమ్మ' పుస్తకం ముందుకు నడిపింది. నాలో పోరాట స్ఫూర్తిని నిండుగా రగిల్చింది. నేను చివరికంటా సామాన్య జీవనం గడపడానికి కూడా ఆ పుస్తకం దోహదపడింది. ఆ స్ఫూర్తితోనే తీవ్ర నిర్బంధ సమయంలోనూ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రయత్నం చేశాం. ప్రజల్లోకి వెళ్లి సమస్యలను వివరించేందుకు కరపత్రాల వంటి వాటితో పాటు ముఖ్యంగా ప్రజా కళలను ఉపయోగించుకున్నాం. ఆటలు, పాటలు, నాటికలు, బుర్ర కథల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించేవారం. ప్రజలకు కూడా ఈ విధంగా విషయం స్పష్టంగా అర్థమయ్యేది. సాహిత్య అధ్యయనం ఆధారంగా కరపత్రాలు రాసి ముద్రించడం, ప్రజల్లోకి తీసుకెళ్లడం చేస్తుండేవారం. అమ్మ పుస్తక కథానాయకుడు పావెల్ బయటకి వెళ్లలేని పరిస్థితుల్లో తన తల్లితో పార్టీ పత్రిక కార్యాలయానికి సాహిత్యానికి సంబంధించిన కొన్ని వార్తలు ఇచ్చి పంపడం పార్టీకి పత్రికలు ఎంత అవసరమో తెలిపింది. దానిని పార్టీ అవసరాలకు ఎలాంటి సందర్భంలో ఎలా ఉపయోగించుకోవాలో నేర్పింది. పార్టీ తీసుకునే నిర్ణయాలు కింది స్థాయి కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు తెలియడానికి, వారిలో చైతన్యం నింపేందుకు పత్రిక చాలా ముఖ్యమైందని తెలిపింది. పార్టీకి ప్రజలకు మధ్య పత్రిక వారధిలా పని చేస్తుందని నేర్పింది. దీని స్ఫూర్తితో ప్రజాశక్తి పత్రికను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తీవ్ర కృషి చేశాము. ఈ కాలంలో దేశ ద్రోహానికి కుట్రపన్నుతున్నారనే నెపంతో కాంగ్రెస్ సర్కార్ ఎంతో మంది మార్క్సిస్టు నాయకులను జైల్లో పెట్టింది. ఈ సమయంలో జిల్లాలోని మార్క్సిస్టులపై కూడా ఇలాంటి కేసులు బనాయించి జైలుకు పంపింది. నన్ను కూడా జైల్లో వేశారు. అయినా పోరాటాలు కొనసాగించాం. ఒక రకంగా చెప్పాలంటే మార్క్సిస్టులకు 1966 చివరి వరకు జైళ్లే నివాసాలుగా ఉండేవి. 1966చివర్లో జైలు నుంచి విడుదల చేశారు. నేను మొదట పిడిఎఫ్‌లో పని చేశాను. మొదటిసారి ఎన్నికలు జరిగినప్పుడు పిడిఎఫ్ జిల్లాలో 12 స్థానాలు గెలుచుకుంది. ఈ సందర్భంలో 1967లో వచ్చిన సాధారణ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి మొట్టమొదటి సారిగా సిపిఎం నాకు టిక్కెట్ ఇచ్చింది. మంచి మెజార్టీతో గెలిచాను. ఇలా 1977 మినహా వరసగా 6 సార్లు నకిరేకల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాను. ఇది ఒక రికార్డే. పెట్టుబడిదారులు, భూస్వాముల కొమ్ము కాసే పార్టీలు విపరీతమైన విమర్శల దాడి, సైద్ధాంతిక దాడితో పాటు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచినా ప్రజలు మార్క్సిస్టు పార్టీ పక్షానే నిక్కచ్చిగా నిలబడి ఓటేశారు. పార్టీని గెలిపించారు. సుమారు 50ఏళ్ల పాటు ఈ గడ్డపై ఎర్రజెండానే విజయం సాధించింది. అందులో ఇప్పటి వరకు వరసగా 8సార్లు సిపిఎం విజయం సాధించడం వెనుక ఆనాటి నాయకుల త్యాగం, పట్టుదల ఉంది. ఎర్రజెండా నీడలోనే, సోషలిజం సాధించడంతోనే మన బతుకులు బాగు పడతాయన్న విశ్వాసం వారిలో మెండుగా ఉండేది. దీంతో పెట్టుబడిదారులు, బూర్జువ, భూస్వాములు ఎన్ని కుయుక్తులు పన్నినా వాటిని కట్టిపెట్టారు. ఎన్నో నిర్బంధాలను కార్యకర్తలు అధిగమించారు. భూస్వాములతో హోరాహోరీగా పోరాడారు. చివరికి ఎర్రజెండానే ఎగురవేశారు. వారి త్యాగం మరువలేనిది. ఇక 1999లో వయస్సు పైబడిన, అనారోగ్య పరిస్థితుల రీత్యా స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి తప్పుకున్నాను. ఇలా పార్టీని

కాలక్రమంలో చదువుకున్న వారిపై కొన్ని పనులు నమ్మకంగా వదిలేసినా అవి చేయలేకపోవడంతో నా అభిప్రాయం మార్చుకున్నాను. మనస్ఫూర్తిగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసేవారికి చదువుతో పనిలేదు. ఇది 'అమ్మ' పుస్తకం చదువుతున్నప్పుడు కూడా బోధపడింది. 'అమ్మ' వంటి పుస్తకాలు చదివిన తర్వాత సాహిత్యంపై మక్కువ పెరిగింది. అమ్మ పుస్తకంలో కొడుకు పెట్టుబడిదారుల చేతుల్లో బంధీగా పట్టుబడ్డప్పుడు... ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసం, పార్టీ కదలికలు చెదిరిపోకుండా పార్టీ కార్యక్రమాలను కరపత్ర రూపంలో తీసుకెళ్లిన పద్ధతి మాకు స్ఫూర్తిగా నిలిచింది. చిన్నతనంలో అమ్మానాన్నల ప్రేమకు నోచుకోక ఒంటరిగా జీవనం సాగిస్తున్న నన్ను 'అమ్మ' పుస్తకం ముందుకు నడిపింది. నాలో పోరాట స్ఫూర్తిని నిండుగా రగిల్చింది. నేను చివరికంటా సామాన్య జీవనం గడపడానికి కూడా ఆ పుస్తకం దోహదపడింది.



సుదీర్ఘ కాలం పాటు నడపడంలో రైతాంగం, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు నేను చదివిన అనేక పుస్తకాలు నాకు స్ఫూర్తినిచ్చినా.... అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది 'అమ్మ' పుస్తకమే. ★



విజయాల వేటలో రూటు మార్చిన రజనీ

రజనీకాంత్! ఆ పేరు వినగానే సినీ ప్రేక్షకులకు ఎక్కడ లేని హుషారు. భాషాతీతం, భావాతీతం కూడా. ఏమంత అందగాడు కాదు. మొదట్లో పెద్ద అందంగా కనిపించాలనీ అనుకోలేదు. దిలీప్ కుమార్, అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీఆర్, శివాజీ గణేషన్‌లలా మహత్తర నటన ప్రదర్శించిన దాఖలాలూ లేవు. ధరించిన పాత్రలూ పెద్ద ఉదాత్త గంభీరమైనవి కావు. అయినా రజనీకాంత్‌తో ప్రేక్షక జన బాహుళ్యం మమేకమైన తీరు వెనక చాలా కారణాలున్నాయి. కేవలం సినిమా రంగానికే గాక సామాజిక రంగానికి కూడా సంబంధించిన నేపథ్యముంది. 'చంద్రముఖి, శివాజీ, రోబో...' చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన రజనీ గాథ చాలా ఆసక్తికరమైంది. కాకపోతే 1975లో 'అపూర్వ రాగంగళ్' (తెలుగులో తూర్పు పడమర) తో మొదలు పెట్టి 2010లో 'రోబో' వరకూ సాగిన ఈ గాథలో రజనీ పాత్రలు మాత్రమే కాక పాత్రధారి కూడా మారిపోవడం విశేషం.

-పీపీ

తొలి తమిళ సూపర్ స్టార్ భాగవతార్ శతజయంతి సంవత్సరం ఇది. తమిళంలో (తెలుగులో కూడా) కథానాయకుల పాత్రలు అనగానే సకల సద్గుణ సంపన్నమైనవిగా వుండే రోజులవి. మరీ ఎం.జి.రామచంద్రన్ అయితే తన పాత్రలను కూడా వ్యక్తిగత ఇమేజికి అనుగుణంగా మలుచుకున్నాడు. ఆ పాత్రలెప్పుడూ తప్పు చేయవు. అమ్మకు సేవ చేయడం, పేదలను ఆదుకోవడం విలన్లను కొట్టడం ఇదే ఫార్ములా. ఎంజీఆర్ సినిమాల్లో కూడా ఎప్పుడూ మద్యపానం చేయడు సరికదా సిగరెట్ కూడా అంటుకోడు. అమ్మాయిలు ఆయన వెనకబడి పాటలు పాడటం, కలలు కనడం తప్ప ఆయన మాత్రం చేయడు. తెర బయట కూడా ఎప్పుడూ కళ్లజోడు లేకుండా కనిపించడు. ఎంఎస్ఎస్ పాండ్యన్ అనే రచయిత తమిళ సూపర్‌స్టార్ పాత్రల గురించి సవివరమైన పరిశీలన ప్రకటించాడు.అందులోనూ ఎంజీఆర్ రజనీ కాంత్‌ల గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేశాడు. ఎంజీఆర్ రాబిన్‌హుడ్ తరహాలో మధురై వీరన్ వంటి పాత్రలు ధరించాడు. ఇందులో ప్రతినాయక లక్షణాలున్నా పేదల తరపున నిలబడటమే చూస్తాం. ద్రవిడ ఉద్యమం ఉచ్ఛ స్థితిలో వుండటం వల్ల ఎంజీఆర్‌కు ఆ పాత్రలు బాగా చెల్లాయి. ఉత్తరోత్తరా ఆయనను రాజకీయంగానూ తిరుగులేని నాయకుణ్ణి చేశాయి (వాస్తవంలో రాజకీయంగానూ ఎంజీఆర్ సాహసంతో వ్యవహరించింది శూన్యం). రజనీకాంత్ కాలానికి ఆ పరిస్థితులు లేవు. సమాజమూ, రాజకీయాలూ మారాయి. తమిళ తెలుగు సినీ రంగాలలో ఒక శూన్యం ఏర్పడింది. హిందీలో అమితాబ్ బచన్ యాంగ్రీయంగ్‌మాన్‌గా ప్రతినాయక లక్షణాలు గల నాయకుడు (యాంటీ హీరో)గా అద్భుతంగా రాణించడం మొదలైంది. సలీమ్ జావేద్‌లు హాలివుడ్ నుంచి (అనువ)దించిన స్క్రిప్టులు అందుకు గొప్పగా ఉపయోగపడ్డాయి. తెలుగులోనూ వాటినే ఎన్టీఆర్ వంటివారు ధరించి విజయాలు సాధించారు. కె.విశ్వనాథ్, రాఘవేంద్రరావు, దాసరి వంటి వారు ఆ తరుణంలోనే కొంత కొత్తదనం చూపించి తమ తమ తరహాల్లో వాణిజ్య ఫార్ములాలు తయారు చేసుకున్నారు. తమిళంలో మాత్రం బాలచందర్‌తో మొదలై తర్వాత వరుసగా భారతీరాజా భాగ్యరాజా, బాలూ మహేంద్ర వంటి వారు ప్రయోగాత్మకమైన కొత్త చిత్రాలతో విజయాలు సాధించడమే కాక వరవడి మార్చారు. కమల్‌హాసన్, రజనీకాంత్‌లు ఆ సమయంలో హీరోలుగా రావడం తమిళ దర్శకులలో వచ్చిన ఈ మార్పును వేగవంతం చేసింది.

రంగస్థలం నుంచి వచ్చిన బాలచందర్ కాస్త వివాదాస్పదమైన ఇతివృత్తాలతో విడ్డూరమైన పాత్రలతో సినిమాలు రూపొందించడం మొదలెట్టాడు. 'అపూర్వ రాగంగళ్'లో తండ్రి కొడుకులు కూతురిని, తల్లిని పెళ్లి చేసుకోవాలనుకోవడం ఇతివృత్తంగా తీసుకున్నాడు. స్వతహాగా బెంగుళూరులో బస్‌కండక్టరయిన రజనీకాంత్‌ను కొడుకు పాత్రకు ఆయన ఎన్నుకోవడం తర్వాతి సంచలనాలన్నిటికీ శ్రీకారం. కమల్‌హాసన్ బాలనటుడుగా మొదలైనప్పటికీ నాయకుడుగా స్థిరపడింది మాత్రం బాలచందర్ శిష్యరికంలోనే. పదనారు వయందిలే (పదహారేళ్ల వయసు)లో వీరిద్దరూ నటించారు. కమల్‌హాసన్ ఒక విధమైన ప్లేబాయ్

ఇమేజికి పరిమితమైతే రజనీకాంత్ పట్టణ ప్రాంతాల అలగా జన ప్రతిబింబమైనాడు. ఆయన వేషభాషలు, మేనరిజమ్స్ అన్నీ మాస్ మసాలాలై తమిళ గ్రామాల వరకూ పాకాయి. అంతకు ముందు కాలంలో తమిళ చిత్రరంగం డిఎంకె రాజకీయాల పరిధిలో పరిభ్రమిస్తే ఇప్పుడు మారిన సాంస్కృతిక వాణిజ్య సంస్కృతిలో సామాన్యులకు నెరవేరని ఆకాంక్షలకు అలజడికి రజనీకాంత్ ప్రతినిధిగా మారాడు. ఆయన జీవితకథ రాసిన గాయత్రి శ్రీకాంత్ అమెరికన్ హీరో ల మిశ్రమ స్వభావంతో పోల్చారు. జాన్ ఫిక్ దీనిపై వ్యాఖ్యానిస్తూ యాంటీహీరోలు మానవ స్వభావంలోని వక్రభాగానికి ప్రాతినిధ్యం వహిస్తారు గనకే ఆకర్షిస్తారని విశ్లేషించాడు. కమల్ హాసన్ నాజూగ్గా మారుతున్న కొద్ది రజనీకాంత్ రఫ్‌గా తయారైనాడు. ఇద్దరూ రెండు ధృవాలుగా తమిళ పరిశ్రమను నడిపించారు. 1975–85 మధ్య రజనీకాంత్ వంద చిత్రాలు పూర్తి చేసుకున్నాడు. ఈ మధ్యలో రజనీకాంత్ నిజ జీవితంలో అనేక ఘర్షణలు వివాదాలలో (ఇప్పుడు సల్మాన్ ఖాన్‌లా) చిక్కుకున్నాడు.కొన్ని భిన్న పాత్రలలో నటించి దెబ్బతిన్నాడు. హాలీవుడ్ చిత్రం 'బ్లడ్ స్టోన్'లో ప్రాధాన్యత లేని పాత్ర ధరించి భంగపడ్డాడు. బాలీవుడ్‌లో 'అంధా కానూన్' వంటి చిత్రాలతో ప్రవేశించబోయి నిరుత్సాహం మూటకట్టుకున్నాడు. తెర మీద బయటా కూడా ఈ తరహా అనుభవాల తర్వాత అలసిపోయానంటూ ఆధ్యాత్మిక ప్రబోధాలు మొదలు పెట్టడమే కాక నూరవ చిత్రంలో రాఘవేంద్ర స్వామి పాత్ర ధరించాడు. అంతటితో ఒక అధ్యాయం ముగిసింది.

1991లో మణిరత్నం రూపొందించిన 'దళపతి' రజనీకాంత్ నట జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. మమ్ముట్టి దుర్యోధనుడైతే రజనీ కర్ణుడుగా మణిరత్నం మహాభారత కథను మాఫియా నేపథ్యంలో తీసి విజయం సాధించారు (దీనికన్నా ముందు ఆయనే కమల్‌తో 'నాయకుడు' కూడా తీశాడు). రజనీకాంత్ అప్పటికే బాగా ఖరీదైన నటుడై పోయాడు. ఇక ఆయనతో కొత్త ప్రయోగాలు ప్రయత్నాలు చేసే సాహసం చిన్న దర్శకులకు దూరమై పోయింది. 'వడియప్ప'(బాషా) అతని వసూళ్ల శక్తిని కొత్త శిఖరాలకు తీసుకువెళ్లింది. తర్వాత 'ముత్తు, నరసింహ' వగైరా. ఇవన్నీ తమిళంలో విజయం సాధించడమే గాక తెలుగులోనూ పెద్ద చిత్రాలను మించిపోయాయి. ఇన్నిటి తర్వాత తను చిత్రాలు విరమించుకుంటున్నానని, 'బాబా' విజయవంతమైతే ఆఖరి చిత్రం అవుతుందని ప్రకటించాడు. కాని అర్థం లేని ఆ మంత్రాల చిత్రం ఘోరంగా దెబ్బతిన్నది. కొనుగోలు దార్లకు డబ్బులు తిరిగిఇచ్చేశాడు. రజనీకాంత్‌లో మరో మార్పునకు ఇది దారి తీసింది.



తన స్వంత పాత్ర, మేనరిజమ్స్ కన్నా కథకు, సాంకేతిక నైపుణ్యానికి ఎక్కువ మొగ్గుచూపడం మొదలెట్టాడు. ఉదాహరణకు 'చంద్రముఖి' 800 రోజులకు పైగా ఆడి ఘన విజయం సాధించింది గాని అందులో హీరోగా రజనీ ప్రత్యేకత చాలా స్వల్పం. కాని ఆయన నటించకపోతే అంతటి వసూళ్ళు వచ్చేవా అంటే రావు. ఆ తర్వాత 'శివాజీ'. దీంట్లో నల్లడబ్బుపై పోరాటం చేయడానికి ఎంచుకున్న మార్గం చాలా కృత్రిమమైనదే గాక సాంకేతికమైనది. తొలి వారాలలో వసూళ్ళు వచ్చినంతగా తర్వాత రాకపోయినా లాభాలకు లోటు రాలేదు. వందలాది ప్రింట్లతో విడుదల చేయడమే ఇందుకు తారకమంత్రం. ఇక ఇప్పుడు ఆడుతున్న 'రోబో' అయితే పక్కా సాంకేతిక గారడీ తప్ప ఆయన నటనకు వున్న అవకాశాలు చాలా చాలా తక్కువ. వీడియో గేమ్‌లాంటి ఈ చిత్రంలో ప్రపంచ సుందరిని పక్కన పెట్టుకుని విజయం సాధించడం రజనీ అనే సూపర్ స్టార్‌డమ్‌కు నిరూపణ ఏమీ కాదు. ఇందులో వున్నది ఒక విధమైన రాజీ లేదా వాస్తవాల ఒప్పుకోలు మాత్రమే. ఆ విధంగా తను జనాలకు దగ్గరగా వుండి వసూళ్లకు ఢోకా లేకుండా చూసుకోవాలని రజనీ నిర్ణయించుకున్నాడు. కాకపోతే ఇప్పటికి అన్ని చిత్రాల్లోనూ దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేస్తూనే వుంటాడు గనక హీరో ఇమేజికి నష్టం రాదు. భవిష్యత్తులోనూ రజనీ చిత్రాలు ఈ తరహాలోనే కొనసాగవచ్చునే తప్ప తొలి రోజుల నాటి ప్రయోగశీలత, ప్రత్యామ్నాయ హీరోయిజం వుండకపోవచ్చు. ఇలాంటి కథలు దొరికి ఖర్చులు భరించాలి గనకనే ఆయన చిత్రాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. మొదటి పదేళ్లలో ఏడాదికి పది చిత్రాలైతే ఈ పద్నాలుగేళ్లలో ఆరంటే ఆరు చిత్రాలే చేశాడు. ఇందుకు వయస్సు మాత్రమే కారణం కాదు. మారిన పరిస్థితులలో తన పరిమితులను గుర్తించి ఆయన మార్గం మార్చుకున్నాడనేది స్పష్టం. తర్వాత మిగిలిన చాలామందిలాగే ఆయన కూడా రాజకీయాలలో ప్రవేశిస్తాడా లేదా అన్నది ఇప్పటికి ఇంకా తెలియదు గాని ఆయన దాన్ని తోసిపుచ్చడం లేదు. బహుశా అందువల్లనే నామకార్థకంగానైనా సినిమాలు చేస్తూ తెరపై కనిపిస్తూనే వుంటాడు.

ఇరవయ్యవ శతాబ్దపు అతి శక్తివంతమైన సినిమా ప్రక్రియ రాజకీయ సాంస్కృతిక రంగాలను కూడా అమితంగా ప్రభావితం చేస్తుందనడానికి తమిళ తెలుగు సమాజాలే పెద్ద ఉదాహరణలు. చిరంజీవి ప్రయోగం ప్రస్తుతానికి విఫలమైన నేపథ్యంలో రజనీ ఎలాంటి అడుగులు వేస్తాడో చూడాల్సిందే.

అపూర్వ రాగంగళ్ లో...



మీరు కంప్యూటర్‌పై ఎక్కువ సమయం పనిచేస్తున్నారా? ప్రతినిత్యం మనం ఉపయోగించే కంప్యూటర్ల వల్ల విచిత్రమైన వ్యాధులు వస్తాయంటే నమ్ముతారా? కంప్యూటర్ల వాడకం పెరుగుతున్న కొద్దీ ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు వినియోగదారులు కూడా దీనికి మినహాయింపు కాదు. ముఖ్యంగా సెల్‌ఫోన్లపై అదేపనిగా గేమ్స్ ఆడటం, ఎస్‌ఎంఎస్‌లు పంపడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తాయంటే ఆశ్చర్యపోకతప్పదు మరి.

కంప్యూటర్‌తో వచ్చే వ్యాధులు

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు వంటివాటిని ఎక్కువగా వాడడం వల్ల వాటినుండి వచ్చే రేడియేషన్ ప్రభావం తీవ్ర అనారోగ్యానికి గురిచేస్తుంది. దీనివల్ల కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ (సివిఎస్), రిపిటేటివ్ స్ట్రెస్ ఇంజురీ (ఆర్ఎస్ఐ), టొయస్ట్ స్కిన్ సిండ్రోమ్, టెక్నోస్ట్రెస్ వంటి వ్యాధులకు గురవుతారు. శరీర భాగాలపై నిరంతర ఒత్తిడి అనేది ఆర్ఎస్ఐకి దారితీసే కారణాల్లో అతి ముఖ్యమైనది. నిరంతరం కంప్యూటర్లతో కలిసి వుండడం వల్ల మనుషుల్లో కూడా యాంత్రిక ధోరణి గూడుకట్టుకుంటోందని, దీనివల్ల అడిగినదానికి వెంటనే జవాబివ్వడం, చాలా అలెర్ట్‌గా వుండడం, భావోద్వేగాలకు లోనుకాకపోవడం, ఎంతో సమయం పట్టేపనిని కొద్ది సెకన్లలోనే పూర్తి చేయాలనుకోవడం వంటి లక్షణాలు కంప్యూటర్ ప్రొఫెషనల్స్‌లో కొట్టవచ్చినట్లు కనబడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వివరాల్లోకి వెళితే...

ఆర్ఎస్ఐ :ఒకే విధమైన పనిని ఎడతెరిపి లేకుండా చేస్తూ వుండడం వల్ల కండరాలపై ఒత్తిడి పెరిగి నరాలు పట్టు కోల్పోవడం, చచ్చుపడిపోవడం వంటి లక్షణాలు కన్పించడాన్ని ఆర్ఎస్ఐ (Repetitive Stress Injury) అంటారు. ఉదాహరణకి కంప్యూటర్ కీబోర్డ్‌తో అదేపనిగా టైప్ చేయడం వల్ల చేతివేళ్ళకి ఈ వ్యాధి వచ్చే అవకాశం వుంది. సిటిఎస్ (Carpal Tunnel Syndrome) అనేది ఒక రకమైన ఆర్ఎస్ఐ. చేతి మధ్య నుండి మణికట్టు ద్వారా వెళ్ళే నరంపై ఒత్తిడి పెరగడం వల్ల చేతిలో సూదులతో గుచ్చుతున్నట్లుగా బాధ కలగడం, స్పర్శజ్ఞానం కోల్పోవడం, వస్తువులను పట్టుకోలేకపోవడం వంటి లక్షణాలను సిటిఎస్ అంటారు. దక్షిణాసియా దేశాలతో పోల్చితే కంప్యూటర్ల వాడకం ఎక్కువగా వున్న యూరోపియన్ దేశాల్లోనే ఎక్కువమంది ఈ వ్యాధి వున్నట్లు అంచనా. కేవలం చేతులకేకాక శరీరంలోని ఏ భాగంలోనైనా ఈ వ్యాధి లక్షణాలు కనిపించవచ్చు. ముఖ్యంగా భుజాలు, మెడలోని కండరాలు, అరికాళ్ళు, మోకాళ్ళు, నడుముభాగంలో ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి.

అసలు ఆర్ఎస్ఐ ఎందుకు వస్తుంది? ఎంతవరకు దీన్ని ప్రమాదకారిగా గుర్తించవచ్చు? వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోగలమా? అనే అంశాలపై జరిగిన ఓ సర్వేలో వెల్లడైన అంశాలు- ఎడతెరిపిలేకుండా టైప్ చేయడం, అతి ఎక్కువ సమయం టైప్ చేయడం, తల తిప్పకుండా పనిచేయడం, మణికట్టు వంచి పనిచేయడం, అదే పనిగా మౌస్ వాడడం, కదలకుండా ఒకేచోట కూర్చొని వుండడం, కాళ్ళ కింద సపోర్ట్ (ఫుట్ రెస్ట్) లేకుండా కూర్చోవడం, అతి తక్కువ లేక అతి ఎక్కువ కాంతిలో పనిచేయడం

సివిఎస్ : ఇటీవల ఎక్కువగా వ్యాప్తిచెందుతున్న వ్యాధుల్లో ఇదొకటి. దీన్ని మామూలు భాషలో 'పొడి కళ్ళు' అంటారు. కళ్ళు పొడిబారతాయి. నొప్పిగాను, దురదగాను అనిపిస్తుంది. కంప్యూటర్‌పై పనిచేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే ఈ 'కంప్యూటర్ విజన్ సిండ్రోమ్' వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10మిలియన్ల మంది 'కంప్యూటర్ విజన్ సిండ్రోమ్'కు గురవుతున్నట్లు అమెరికాలో జరిపిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. ప్రతిరోజూ మూడు గంటలకు మించి కంప్యూటర్లపై పనిచేసేవారిలో కంటికి సంబంధించిన సమస్యలు అధికంగా వున్నాయని ఈ అధ్యయనం వెల్లడించింది. కళ్ళమంట, కళ్ళు తడి ఆరిపోవడం, తల, మెడ కండరాల నొప్పులు, తలపోటు, కళ్ళు మసకబారడం వంటివి ఈ సివిఎస్ లక్షణాలు. ఈ సమస్య ఉత్పన్నం కావడానికి కంప్యూటర్ మోనిటర్ నుండి జనించే రేడియేషన్ ప్రధాన కారణం. దీంతోపాటు కంప్యూటర్ వున్న పరిసరాల్లోని వెలుతురులో హెచ్చుతగ్గులు, కంప్యూటర్ అమరిక, కూర్చునే విధానం, గంటల తరబడి కదలకుండా కంప్యూటర్‌పై పనిచేయడం వంటివి కారణమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టెక్నోస్ట్రెస్ (Technostress) : దీనివల్ల కంప్యూటర్ ప్రొఫెషనల్స్‌లో ఒకరకమైన టెన్షన్, అసహనం, ఇతరులపై సానుభూతి లోపించడం, మెషీన్‌లా పనిచేయడం వంటి లక్షణాలు గోచరిస్తాయి.

టొయస్ట్ స్కిన్ సిండ్రోమ్ : ముఖ్యంగా ల్యాప్‌టాప్ వాడేవారికి 'టొయస్ట్ స్కిన్ సిండ్రోమ్' అనే చర్మవ్యాధి సోకే ప్రమాదం వుంది. ల్యాప్‌టాప్‌ను గంటలకొద్దీ కాళ్ళపై పెట్టుకొని పనిచేయడం వల్ల ఈ వ్యాధి వచ్చి చర్మం అసాధారణంగా కనిపిస్తుందని 'స్విస్' అధ్యయనం గుర్తించిందని టెలిగ్రాఫ్ తన నివేదికలో వెల్లడించింది. ల్యాప్‌టాప్ నుంచి 125 ఫారిన్‌హీట్ (52 సెంటీగ్రేడ్) వెలువడుతుంది. కొన్ని సందర్భాల్లో చర్మం శాశ్వతంగా నల్లబడిపోతుందని యూనివర్శిటీ హాస్పిటల్ బసెల్‌లో దీనిపై అధ్యయనం చేసిన డాక్టర్ అన్‌డ్రెస్ అర్నాల్డ్ పీటర్ వెల్లడించారు. కొన్ని సందర్భాల్లో చర్మ క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా వుందని ఆయన పేర్కొన్నారు.

వీటితోపాటు నిద్ర పట్టకపోవడం, సరైన వ్యాయామం లేక బిపి, సుగర్ వంటి జబ్బులతోపాటు ఊబకాయం వంటి సమస్యలకు లోనుకావడం జరుగుతుంది. ఎక్కువ సమయం కంప్యూటర్ ఉపయోగించేవారు అందుకు తగినట్లుగానే ఆరోగ్యపరమైన జాగ్రత్తలూ తీసుకోవడం తప్పనిసరి. ఈ వ్యాధులు నిర్ణీతస్థాయిని మించి ముదిరిపోతే శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం కూడా ఏర్పడుతుంది. ఈ దృష్ట్యా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- తక్కువ రేడియేషన్‌నిచ్చే మంచి క్వాలిటీ మోనిటర్స్‌ను ఎంచుకోవాలి, - యాంటీగ్లేర్ స్క్రీన్స్ వాడాలి. తద్వారా మోనిటర్ నుండి వచ్చే రేడియేషన్ ప్రభావం కంటిపై కొంతవరకు తగ్గుతుంది, - పనిచేస్తున్నప్పుడు ప్రతి మూడుగంటలకోసారి కనీసం 10నిమిషాలపాటు విశ్రాంతి తీసుకోవడం, చల్లటి నీటితో ముఖం కడుక్కోవడం చేయాలి, - ఎక్కువసార్లు కనురెప్పలు మూసి తెరుస్తూ వుండాలి, - కంటికీ స్క్రీన్‌కు మధ్య దూరం 55నుంచి 75సెం.మీ. వరకు వుండాలి, - సాధారణంగా మోనిటర్ మధ్యభాగం కళ్ళతో పోల్చినప్పుడు 4నుంచి 6అంగుళాలు కిందికి వుండాలి. దీనివల్ల కంటిపాపను కనురెప్పలు కొంతవరకు కప్పివుంచుతాయి, - ఎసి వున్న గదుల్లో ఆ గాలి డైరెక్ట్‌గా కళ్ళకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, - కంప్యూటర్‌పై కూర్చునేవారికి ఎదురుగా లైట్ వుండకూడదు. దీనివల్ల కాంతికిరణాలు కళ్ళపై పడతాయి. దీన్ని నివారించాలి, - కీబోర్డ్ లేదా మౌస్‌తో పనిచేస్తున్నప్పుడు చేతి మణికట్టు కింద ఒక సపోర్ట్‌ని ఉపయోగించాలి, - కంప్యూటర్ మోనిటర్‌ని కళ్ళకి సమానమైన ఎత్తులో వుండేటట్లు చూసుకోవాలి, - కాళ్ళకి కూడా సపోర్ట్ (ఫుట్‌రెస్ట్) వాడాలి, - ఎడతెరిపి లేకుండా పనిచేయకుండా మధ్యమధ్యలో కొన్ని నిమిషాలు రెస్ట్ తీసుకోవాలి, - ఎప్పుడూ ఒకే సీటులో కూర్చోకుండా సీటు మారుస్తుండాలి.

-కె.ఎక్స్.రాజు

మరణ సదృశ్యమే...

దూరమవడం ఎప్పుడూ
మరణ సదృశ్యమే...
మెరుపులా వచ్చి
కలల అలలపై
ఓల లాడించి
వలపును ఒడుపుతో
మనసులో గుప్పించి
మౌనంగా మాట్లాడి
కళ్ళతో మమకారాన్ని నింపి
సుదూర తీరాలలో
ఎవరికి అందని ప్రేమను
శరీరం అంత నింపేసి
అణువణువులో నీ నామాన్ని
అతికించి...
ఇపుడు దూరమవడం

నరకయాతనే!
గంటల తరబడి మాట్లాడిన
ఊసులన్ని ఇపుడు వ్యర్థమేనా
నిరీక్షణలో...
నీ రూప దర్శనముకై
పడిన వేదన అంతా శూన్యమేనా
ఆకాశంపై ఆశపడడం
అడియాశే అవుతుంది
అందుకే మళ్ళీ మళ్ళీ
చెబుతున్నా దూరమవడం
ఎప్పుడూ మరణ సదృశ్యమే!

ఇ.వెంకటేష్

పాలన!?

దిక్కు మొక్కు లేక
ఆలన పాలన కరువై
ప్రజానీకం అల్లాడుతుండ
ప్రజల వద్దకు పాలనట?!?
నలుగురూ నవ్వి పోదురు!
పథకాలెన్ని వున్నా...
ఫలాలు ప్రజలకు చేరుట సున్న!
ఎన్నికలకు పదవుల పంపకాలకే
సమయం చాలుట లేదాయె?
కోరలు తీసిన పాముల్లా
ప్రజల నుంచుట ముంచుటే
నేటి మేటి నీతాయె?
నేతలు స్వార్థం మరిగిన
నంగలు..చుప్ప నాతులైరి!
ఉపన్యాసాలు వారి వంతు
ఉపవాసాలు బడుగుల వంతు!
ప్రజలను సర్కస్‌లో బఫూన్లలా
ఆడించుట నేతల నైజమాయె?
ఎదురు తిరిగితే లాఠీఛార్జ్ ఆయె!
సుపరిపాలన కనుమరుగై
గూండా రాజకీయాలు
రాజ్యమేలుతున్న వాయె!?
ఎటుచూతమన్న
నాన్నుడు...ముంచుడు వ్యవహారమేనాయె!
ప్రజలను సుఖపెట్టే ఆలోచనే కరువాయె!

- యస్.వివేకానంద



అడుగులు వేస్తూ...

ఆస్తికత్వం చందన పూతతో
అరాచకత్వం వాతగానో
భక్తి సంగీతంతో
మైధునాసక్తులుగానో
గోముఖ వ్యాఘ్రాలుగానో
మన ముందూ వెనకా ప్రక్కన
మనతోనే వుంటారు
మంత్ర ముగ్ధుల్ని చేస్తారు
వశీకరణ విద్యలవుతారు
పరకాయ ప్రవేశాలవుతారు
నిండు జీవితాలకి
నిప్పుల పంటలవుతారు
పచ్చని పైరులకి
ముప్పుల మంటలవుతారు
మన మధ్యే వుంటారు
మనతోనే తిరుగుతారు
ఊరూ వాడా ఉప్పెనలవుతారు
అందరినీ ఓ కంట
కనిపెడుతూనే వుండాలి
అందరితోనూ
కలివిడిగానే వుండాలి
అంతరంగాలను
అవలోకిస్తూనే
అడుగులు వేస్తూ వుండాలి

-బద్ది నాగేశ్వరరావు

★

సీరియల్

వియత్నాం వీరుడు

ఎన్గుయెన్ వాన్ ట్రాయ్

జరిగినకథ:

కుయేన్ ఎట్టకేలకు ట్రాయ్‌ను కలుస్తుంది. గాయాలతో వున్న అతణ్ణి చూసి బాధపడుతుంది. వారిద్దరూ మనస్ఫూర్తిగా మాట్లాడుకోవడానికి కూడా పోలీసు అధికారులు అవకాశమివ్వరు. పైగా చుక్కలాంటి భార్యను వదిలి జైళ్లలో మగ్గుతున్నావంటూ ట్రాయ్‌ను మార్చడానికి ప్రయత్నిస్తారు. దానికి ట్రాయ్ మాంచి సమాధానమే చెప్తాడు. యాంకీలు వున్నంత వరకు తమకెవరికీ సుఖశాంతులు లేవంటాడు. తర్వాత కుయేన్‌ను వేరే జైలుకు మారుస్తారు. అక్కడ చిన్న కొట్టులాంటి గదిలో పదిమంది మహిళాఖైదీలు వుంటారు. వారి బాధలు, గాథలు, ఏడుపులు, విజయగాథలు, సాహసాలు...అన్నీ కుయేన్ తెలుసుకుంటుంటుంది. వారు తనపట్ల చూపించిన ఆదరణను చూచి కన్నీళ్లు పెట్టుకుంటుంది. ట్రాయ్ భార్య ఈమేనని తెల్సుకొని మహిళలు చాలా సంతోషిస్తారు. ఏదైనా అవసరమైతే నిర్మొహమాటంగా తమకు చెప్పమంటారు. పోలీసులు పెడుతున్న హింసను పంటిబిగువున భరించారేగానీ...వారి ముందు ఏడవడానికి కూడా ప్రయత్నించరు. ఐతే కిటికీ గోడ దూకిన ట్రాయ్‌కి కాలు విరిగిందని కుయేన్‌కు తెలుస్తుంది.

ఐదవ భాగం

కథనం: **ఫాన్-ధి-కుయేన్**

అనువాదం: **పాటూరి రామయ్య**

చివరికి మాలో ఒకరికి ట్రాయ్‌ని చూడ్డానికి అనుమతించారు. మా ప్రతినిధి ట్రాయ్‌తో మాట్లాడ్డానికి ప్రయత్నించింది. కాని అతడు స్పృహ తప్పి వున్నాడు. నిద్రపోతున్నప్పుడు మాదిరి అతని కళ్ళు మూతలుబడి వున్నాయి. ఉఛ్వాస నిశ్వాసాలూ అంతంత మాత్రంగానే ఉన్నాయి. అతని భోజనం పూర్తి చేయించేందుకు వార్డరు కోసం ఎదురు చూశారు ఎస్కార్టు వాళ్ళు.

అంతా పూర్తయిన తర్వాత అతణ్ణి ఒక కొట్లో పెట్టి తాళం బిగించారు. ఆ రాత్రి తొమ్మిది గంటలకు పోలీసులు వ్యానులో మళ్ళీ వచ్చారు. ట్రాయ్‌ని మరో స్థలానికి మార్చారు.

ఇలా మార్చడానికి కారణం గేటు కాపలావాడిద్వారా తెలుసుకొన్నాం. వారు తలూపుతూ ఇలా చెప్పాడు.

'వీడు వియత్కాంగ్ వీరుడు' జైలు నుంచి తప్పించుకుపోవాలని పట్టపగలు కిటికీలోంచి కిందికి దూకాడు. కాలిరిగింది. అందువల్ల ఇక్కడికి తీసుకొచ్చారు. వీడు మళ్ళీ ఉడాయిస్తాడని అందరూ అనుకొంటున్నారు. జైలు కొట్లో కిటికీ కేసి అదేపనిగా చూస్తానన్నాడు. సాయంత్రమంతా కాలుకు కట్టిన బ్యాండేజీ పీకి వేశాడు. మళ్ళీ దూకి తప్పించుకెళ్ళడానికి కాబోలు! గట్టి బందోబస్తు వున్న చోటుకు మార్చారులే. వాడు మళ్ళీ తప్పించుకొని పారిపోయాడా... మా అందరి గొంతుకు వస్తుంది."

రెండు రోజుల తర్వాత మేము మళ్ళీ పోలీసు ఎస్కార్టును కలవడం సభవించింది. ట్రాయ్ సాహసోపేతమైన చర్యల్ని గురించి ఒక గాథగా మాకు చెప్పారు. ఛోరే ఆసుపత్రి నుంచి మధ్యరాత్రిలో ట్రాయ్‌ని ఇంకో జైలుకు మార్చారు. కొంతమంది ముష్కరులు వచ్చి అతనిని సోదా చేశారు. ఆరోజే మళ్ళీ తప్పించుకొని పోవడానికి ప్రయత్నించాడని విని వాళ్ళంతా భయపడ్డారు.

ఒక కాలు విరిగి పోయింది. ఇనప సంకెళ్ళతో చేతులు బంధించారు. శరీరం బాగా హూనమై వుంది. అయినప్పటికీ అతని దృఢదీక్ష చెక్కుచెదరలేదు. అతని జవాబులన్నీ చాలా వాడి కలిగి వున్నవి. కమ్యూనిస్టు ఏజంటు అని నేరం ఆరోపించారు. కమ్యూనిస్టుల ప్రేరణవల్ల ఇంత సాహసానికి ఒడిగట్టాడని ట్రాయ్ ఆరోపించబడ్డాడు. కమ్యూనిజాన్ని నిర్మూలించాలన్న దుష్టప్రయత్నంలో ఒక భాగంగా మాత్రమే ఈ నేరారోపణలు.

కమ్యూనిస్టు ఎవ్వరికీ, ఎప్పుడూ ఎటువంటి హాని చేస్తుండగా తాను చూడలేదని, తన బాల్యం నుండి యాంకీలు సైగాన్ ఆకాశమండలం లోంచి విమానదాడులు చేస్తూ బాంబులతోనూ, తుపాకి గుండ్లతోనూ ప్రజల్ని మూకుమ్మడిగా చంపుతూ మారణహోమం గావిస్తున్నారని ధైర్యంగా జవాబిచ్చాడు.

'మీరు బుద్ధిలేని వాళ్ళు. నన్ను కమ్యూనిస్టుల ఏజంటని పిలుస్తున్నారు. అది వ్యక్తిగా నా గౌరవాన్ని మరీ పెంచుతుంది. దీన్ని మహాపవిత్రంగా భావిస్తాను. కమ్యూనిస్టులు ప్రజల శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగాలు చేస్తున్నారు. అమెరికా బడితొత్తులు కమ్యూనిస్టులను చూసి సిగ్గుపడాలి.

గట్టి బందోబస్తు పెట్టకపోతే ఆ రాత్రికి రాత్రే తప్పించుకొని వెళ్తాడని ముష్కరులు పోలీసులకు హుకుం జారీ చేశారు. పక్కనవున్న పోలీసు వాళ్ళకు రాజకీయ పరిస్థితులు చక్కగా వివరించాడు ట్రాయ్. ఆ పోలీసుల్లో ఒకడు ట్రాయ్‌ని ఆకాశానికెత్తి పొగిడాడు. అతడు చెప్పాడు గదా - ముష్కరులతో మాట్లాడినంత కఠినంగా పోలీసులతో మాట్లాడలేదుట. చాలా నమ్రతగా నచ్చ చెప్పి ఒప్పించే విధంగా మాట్లాడేవాడట. మొత్తానికి ఆ వెధవ ముష్కరులకి "కుక్క కాటుకి చెప్పుదెబ్బ" వలె అయిందట.

ట్రాయ్ తాగడానికి మంచినీరు తెచ్చి యిచ్చామని, ఒళ్ళు తుడుచుకోడానికి తుండుగుడ్డ తడిపి ఇచ్చామని ఆ పోలీసువాళ్ళు చెప్పుకున్నారు.

◆◆◆

ఒకరోజు మహిళా ఖైదీలందరినీ ఎండ కాగేందుకు అనుమతించారు. 'ఎక్స్' సోదరి చెప్పే విషయాలు వినేవాళ్లం. ఇంకా... ఇతర జైళ్ళలో

సోదరీమణులు సలిపే పోరాట గాథలను గురించి వినేవాళ్ళం. 'ఎక్స్' సోదరికి చాలా జైళ్ళు తెలుసు. ఏకాంతంగా ఖైదు గడపడంలో ఆమెకు సంవత్సరాల కొలది అనుభవం వుంది. ఆమె భర్తకు మరణశిక్ష విధించారు. బహుశా ఇప్పటికి ఉరితీసే వుండవచ్చు. జైల్లో వున్న మా అందరి సంతోషానికి, ఆశలకు ఆమె పట్టుగొమ్మ.

కంఠస్థం చేసిన పాఠం ఒప్పచెప్పినట్లు అప్పుడప్పుడూ 'డాంగ్ సోదరా!" అనే గీతం అప్పజెప్పేది. అది 'కమ్యూనిస్టు తేజం' అన్న గీతమని మా అందరికీ తెలుసు.

డాంగ్ సోదరుని విప్లవ కృత్యాలను, గియాన్‌దిన్ జైల్లో అతని వీరమరణం గురించి ఆమె మాకు చెప్పేది. డాంగ్ భార్య ఆమె పిల్లల మీద ఎలా జాగ్రత్తలు తీసుకునేది, భర్త విప్లవ కార్యకలాపాలకు ఎలా తోడ్పడిందీ చెప్పి ఆమెను పొగిడేది ఎక్స్ సోదరి.

ఇలాంటి భార్యల గురించిన కథలను నేను ప్రత్యేకించి వినేదాన్ని. వారి భర్తలకు సాటిగా సుఖదుఃఖాలలో పాలుపంచుకోవడం, విశ్వాసవంతంగా ఉండటం విని నేనెంతో ఉప్పొంగిపోతూ వుండేదాన్ని. ఇలాంటి కథలన్నీ వింటున్నప్పుడు నేను చాలా సిగ్గుపడేదాన్ని. ఎందువల్లనంటే వీళ్ళవలె నా భర్త విప్లవ కార్యకలాపాలకు కించిత్తయినా తోడ్పడలేకపోయాను.

'అయ్యో ట్రాయ్!'

ప్రతిసారి ఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు. నా తల్లిదండ్రుల కోసం పలు జాగ్రత్తలు తీసుకుంటూ వుండేవాడు. నా చిన్న తమ్ముణ్ణి వెంట తీసుకెళ్తుండేవాడు. ఆయన ఒక్క ఆలోచనతో స్థిరపడి వుండేవాడుకాదు. అందువల్ల నేను అనుమానించాను.

ఆ వాస్తవాలన్నీ ఒక్కొక్కటి నా కళ్ళముందు మెదలుతోంటే హృదయాన్ని సూదులతో గుచ్చినట్లయింది.

కష్టాలతో కూడుకున్నది, అపాయంతో నిండినదీ అయిన ఆ పథకం కోసం తగిన బలాన్ని, వనర్లనూ అనేక యిబ్బందులు పడుతూ సేకరించుకుంటూనే నా మనస్సుకు శాంతిని, హాయినిచ్చేందుకు ప్రయత్నించాడు ట్రాయ్.

నా కళ్ళలోంచి అశ్రువులు రాలుతున్నాయి. 'ఎక్స్' సోదరి చూసింది. ఆమె ఇలా అన్నది 'నిన్ను నువ్వే సంభాళించుకునేందుకు ప్రయత్నించు. నీవు ఏడ్చినట్లయితే ఇక్కడ మన వాళ్ళంతా నిన్ను తీవ్రంగా అనుమానిస్తారు' మా నుండి నిన్ను వేరు చేస్తారు".

ఆమెతో నేనిలా అన్నాను

'విప్లవ కార్యాచరణకు భార్యాభర్తలు పరస్పర తోడ్పాటు నందించుకొంటున్నారు. కానీ, ట్రాయ్‌కి నేను అలా వీసమెత్తయినా తోడ్పడలేకపోగా అనుమానించి బాధ కలిగించాను. ఆయన నన్ను ఎలా నమ్మాలి?'

'విప్లవ కార్యాచరణలో అతనికి ప్రతిఒక్కరూ ఎంత శ్రమపడైనా సహాయపడాలి. విప్లవ కార్యకలాపాలకు సంబంధించి ఇతరులెవ్వరికీ అతడు చెప్పకూడదు. ఇది ఖచ్చితమైన ఒక నిబంధన. అందరూ ఈ నిర్మాణ సూత్రానికి బద్ధులై వుండాలి. అంతేగాని నిన్ను నమ్మకుండా ఎలా ప్రేమించగలిగాడు? ఇప్పుడు మీరిద్దరూ తరుచుగా మాట్లాడుకొంటున్నారా?'

'నాలో కొన్ని పొరబాట్లున్నట్లు ఆయన తెలుసుకున్నాడు.'

"ఎలా ఎందుకని?"

కొంచెంసేపు ఆలోచించి ఇలా అన్నాను.

'మాచుట్టుపక్కల వాళ్ళను నేను మర్యాదగా చూసేదాన్ని కాదు. అప్పుడాయన తన అసమ్మతిని తెలిపేవాడు. ఆడంబరమైన దుస్తులు ఇష్టపడేవాడుకాదు. ఆయన ఇలా చెప్పేవాడు. "మనం కష్టజీవులం, ఆడంబరమైన దుస్తులు మనకు తగినవి కావు" అని. సాదా నీలిరంగులో గాని లేదా తెలుపులో గాని నా బట్టలుండేవి.

ఈ రెండు రంగులూ ఆయనకు బహుఇష్టం. సినిమాలు చూసేందుకు సుతరాం ఇష్టపడేవాడుకాదు. హనోయ్‌వలె సైగాన్ అభివృద్ధి చెందాలని కలలుగనేవాళ్ళం. మేమా రెండు సంవత్సరాలలో పరస్పరం అర్థం చేసుకున్నాం. ఆ రెండు సంవత్సరాలలో ఒకసారి మాత్రమే సినిమా కెళ్ళాం.'

'ఎక్స్' సోదరి ఇలా అడిగింది.

'యాంకీలను ట్రాయ్ ఎంత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదీ ఇప్పుడు తెలుసుకున్నావు. ఈ విషయాలు నీ కెప్పుడైనాచెప్పాడా?"

'అప్పుడప్పుడూ చెబుతుండేవాడు. 1954లో అమెరికా-ధియమ్ పిండారీ గుంపు సాగించిన కమ్యూనిస్టు వ్యతిరేక యుద్ధానికి మొదట గురైంది తన స్వంత ప్రాంతమేనని చెప్పాడు. ఇంకా ఇలా చెప్పాడు. 'ప్రజల చేతులను వైర్లతో బంధించి ఛోదోక్ బిన్ ట్రీన్‌లకు తీసుకెళ్ళారు. వాళ్ళు మళ్ళీ తిరిగిరాలేదు. వాళ్ళను నేరుగా స్వర్గానికి పంపించేసి వుంటారు."

ఒకసారి ఆయన అక్క ట్రాయ్‌తో ఇలా చెప్పింది.

"అదృష్టవశాత్తు అప్పుడు పిల్లవాడిగా వున్నావు. లేకపోతే ఆ దుర్మార్గుల బారినుండి తప్పించుకుని వుండేవాడివి కాదు."

మేము పరస్పరం ప్రేమించుకొన్న తరువాత ఆయన స్వగ్రామమైన క్వాంగ్‌జామ్ వెళ్ళాడు. అక్కడినుండి హ్యూ నగరం వరకు వెళ్ళాడు. ఆయన మొట్టమొదట అక్కడ బౌద్ధులు హింసాకాండకు గురికావడం చూశాడు. తర్వాత సైగాన్‌కు తిరిగి వచ్చాడు. అప్పుడాయన కోపాగ్నితో ఉడికిపోయాడు.

నీటి తొట్లలో వేసి కుక్కడం, శరీరాలు పుండ్లుపడేట్టు హూనం చేయడం లాంటి నానారకాల చిత్రహింసలకు ప్రజలు గురౌతున్నారని తాను కళ్ళారా చూసినట్లు చెప్పాడు.

గతంలో ఫ్రెంచి వాళ్ళకంటే అనేక రెట్లు అధికాధికంగా యాంకీలు ప్రజలపై హింసాకాండ గావిస్తున్నారని చెప్పాడు ట్రాయ్.

ఇవన్నీ స్ఫురణకు తెచ్చుకొంటూ ఇంకా ఇలా చెప్పాడు. 'గొప్ప ప్రజా ప్రదర్శనలను అణచివేసేందుకు తుపాకులు, ఫిరంగులు గూడా ఉపయోగిస్తారు. ప్రపంచంలో ఎక్కడా కనీ, వినీ ఎరుగనంతటి అనాగరిక హింసాకాండ దక్షిణ వియత్నాంలో జరుగుతోంది."

ఆయన అమెరికా దురాక్రమణదార్లను ద్వేషించడం చాలాకాలం నుంచి నాకు తెలుసు. ఇప్పటికీ వాళ్ళను అలా పిలవడు.

ఒకసారి మేము అలా షికారుకని వెళ్ళినప్పుడు ఒక అమెరికా కాపలావాణ్ణి చూశాం. నా వీపుచరిచి ఇలా అన్నాడు. "అదిగో ఆ లంజా కొడుకులను ముందు వెళ్ళనీ". ఎప్పుడైనా అమెరికా దురాక్రమణదారులని చెప్పవలసి వచ్చినప్పుడు ఆ మాటను ఉపయోగించకుండా వుండేవాడు కాదు. ఐనప్పటికీ ఇటీవల వరకు ఆయన అమెరికా వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు నేను స్వయంగా చూడలేదు.

మా పెళ్ళి అయిం తర్వాత ఒకరోజు ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. సంతోషాతిశయంతో ఉప్పొంగి పోతున్నట్లు కనబడ్డాడు. 'ఈరోజు ఒక ప్రత్యేకవార్త. నువ్వు విన్నావా?' అన్నాడు. నేనాశ్చర్యపోయాను.

ఆయన ఇలా చెప్పాడు. '15 వేల టన్నుల బరువుగల అమెరికా ఎయిర్ క్రాఫ్టును ముంచేశారు మన ప్రజలు. అందులో డజన్లకొలది విమానాలున్నాయి. ఎంతటి అద్భుతం – ఎంతటి సాహసం! అలాంటి మహాకార్యాన్ని నేనెప్పుడు చేయగలనో ఆ దేవుడికే తెలియాలి?'

కొన్ని రోజులు అయిన తరువాత భోజనానికి కూడా ఇంటికి రావడంలేదు. అది మే 6వ తేది. ఆనాడు తోటి కార్మికులతో కలిసి ఒక టాక్సీ డ్రైవరు అంత్యక్రియలకు హాజరయ్యాడు. ఆ టాక్సీ డ్రైవరును యాంకీలు చంపారు.

ట్రాయ్ తిరిగి ఇంటికొచ్చాడు. అంతిమయాత్ర బ్రహ్మాండమైన అమెరికా వ్యతిరేక ప్రదర్శనగా మారిందనీ, "అమెరికా దురాక్రమణదారులూ, ముష్కరులూ నశించాలి" అన్న నినాదాలు దిక్కులు పిక్కటిల్లేలా ఆప్రదర్శనలో మార్మోగాయని చెప్పాడు.

మే 15 నుండి 22 తేదీ వరకు 'అమెరికా వ్యతిరేక వారోత్సవం' నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా టాక్సీ డ్రైవర్లు అమెరికన్లకు పని చేసేందుకు నిరాకరించారు. చివరికి వార్తపత్రికలు అమ్మే పిల్లలు, బూట్ పాలిష్ వాళ్ళు తమ పనులు మానివేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటోద్యమంలో ట్రాయ్ చురుగ్గా పాల్గొన్నాడు.

'ఆరోజు మే తొమ్మిది. ఆనాడే ఆయన్ను అరెస్టు చేశారు. 'ఎక్స్' సోదరి ఆశ్చర్యంతో తలూపింది.

(మిగతాది వచ్చేవారం)

అణువణువునా పచ్చదనం

మెట్టుపాళయం నీలగిరి కొండలకు పాదంలాంటిది. మెట్టుపాళయంనిండా 'రోబో' ఫీవరే. ఎటుచూసినా ఆ సినిమా పోస్టర్లే! ఏమైనా ఒక వ్యక్తిపై అంతెత్తున అభిమానం పొంగిపొర్లడం, దాన్ని సంబంధిత వ్యక్తులు భరించడమూ కష్టమేనేమో! అది వికటించిందా ఇక అంతే! కుష్బూకు గుడి కట్టడం, దాన్ని కూలగొట్టడం మనం చూడలేదూ?! ఇక మన యాత్రకొద్దాం.

- కె. అరుణ

మెట్టుపాళయంనుండి ఊటీకి నేరోగేజ్ రైలుమార్గం వుంది. స్టీమ్ ఇంజన్ ట్రెన్. యావత్భారతదేశాన్ని ఉర్రూతలూగించిన 'ఛయ్య ఛయ్య' పాటంతా దీనిమీదనే షూట్ చేశారు. అలాగే సంతోషం లాంటి ఎన్నో తెలుగు సినిమాలూనూ. ఆ రైలు కేవలం మూడే పెట్టెలు. దాని ఛార్జి ఎనిమిది రూపాయలు. ముందే రిజర్వ్ చేయించుకుంటే 23 రూపాయలు. కొండలు, లోయలు, జలపాతాల మీదుగా ఐదున్నర గంటల ప్రయాణం. సింప్లీ సూపర్బ్ అన్నమాట! అటు పక్క చూడాలో, ఇటు పక్క చూడాలో తెలియని డోలాయమానం. అందాలన్నీ కళ్లలో నింపేసుకోవాలన్న తాపత్రయం. తల ఒకవైపు తిప్పితే మరోవైపు మిస్సయిపోతామేమోనన్న ఆత్రం. ఒకదాని వెనుక మరోటి, దాని వెనుక ఇంకోటి... ఇలా అనేక కొండలు, లోయల సమూహం. నీలగిరి కొండల అందాలు ఏమని వర్ణించేది? ప్రకృతికాంత నిండారా తలస్నానంచేసి కురులన్నీ విరబోసుకుని నీరెండలో ఆరబెట్టుకుంటుంటే ఎలా వుంటుంది? అచ్చం అలా వుంది అక్కడి సన్నివేశం. ఓ వైపు ఎత్తైన కొండలు, మరోవైపు లోతైన లోయలు... వీటిముందు మనమెంత? ఏదో సాధించేశామని విర్రవీగే మన అహమెంత?

ఈ కొండల్లో అంతర్లీనంగా కనిపించిందేమిటంటే స్వేచ్ఛ! అవును! స్వేచ్ఛే! ప్రతి చెట్టు తనకు నచ్చిన రీతిలో, తనకు తోచిన దిశవైపు హాయిగా, ఆనందంగా విస్తరించింది. దాన్ని అడ్డుకునేవారూ, అదుపు చేసేవారూ లేరు. ఈ ఆకృతిలోనే పెరగాలనే ఆంక్షలు లేవు. ఆ ఆనందం ప్రతి ఆకులోనూ, పువ్వులోనూ కనిపించింది. అందుకేనేమో మనం పెంచుకునే కుండీల్లోని మొక్కల్లో ఈ జీవం కనిపించదు. ఎంత పోషణ చేసినా సరే! బహుశా మనిషైనా అంతేనేమో! మనం ఎంతో ఖరీదుపెట్టి కొనుక్కునే మొక్కలెన్నో ఇక్కడ పిచ్చిమొక్కల్లా పెరిగాయి. ఇక పేరు తెలీని మొక్కలెన్నో తనువంతా విరిబాలలతో విరగబూశాయి. బలమైన వేళ్లతో విస్తరించిన చెట్లు, పొదలు, తీగలు... అక్టోబర్ నెల, మంచుతెరలింకా తొలగని సంజెవేళ, అబ్బ వర్ణింపశక్యం కావడంలేదు.

బతకాలన్న కోరిక ఎంత బలంగా వుండకపోతే... తన ఉనికిని చాటుకోవాలన్న ఆశ ఎంత తీవ్రంగా లేకపోతే ఆ చెట్లు ఈ బండరాళ్లను చీల్చుకుని పైపైకి ఎగబాకుతాయి?! మరి మనమెందుకు చిన్నపాటి కష్టాలకే వెన్ను చూపిస్తాం? ఎందుకు వెనుకంజ వేస్తాం? భద్రతాలేమి మనల్ని పట్టి పీడించడం వల్లేమో! ప్రపంచంలో ఏ జీవికీ లేని ఆత్మహత్య అనే దౌర్భాగ్యపు ఆలోచన మనకే ఎందుకొస్తోంది?

ఈ ఆలోచనల మధ్య కూనూరు వచ్చింది. అక్కడినుండి చిన్న చిన్న ఊళ్లు, టీ గార్డెన్స్ మొదలయ్యాయి. టీ ప్లాంటేషన్స్, మధ్య నిలువెత్తు 'సిల్వర్ ఓక్స్' వృక్షాలు. అక్కడక్కడా ఆగుతూ ఉదకమండలం.. అదే ఊటీ చేరుకున్నాం. ముదుమలై అడవులకు చేరుకునే మార్గంలో తగిలే ఊటీ పరిసరాలు ముందు చూసి... మిగిలినవి తర్వాత చూడాలనుకున్నాం. సో, ఆ దిశగా పయనించాం. దారిలో ఊటీ లేక్ దర్శనమిచ్చింది. పూర్వం సినిమా డ్యూయెట్లన్నీ అక్కడేగా షూటింగ్(ఉదా: 'అభినందన'లోని 'మంచు కురిసే వేళలో..')! కానీ ఇప్పుడది పొల్యూట్ అయిపోయింది. ఊటీకి సందర్శకుల తాకిడి ఎక్కువనుకుంట! మేం ముందుగా పైన్ ఫారెస్ట్ దగ్గర ఆగాం. అక్కడన్నీ ఆకాశాన్నంటే చెట్లే. మీకు 'వసంత కోకిల' సినిమాలో ఓ సన్నివేశం గుర్తుందా?! అమాయకురాలైన శ్రీదేవి కమల్‌హసన్‌ను "ఈ చెట్లు ఇంత ఎత్తుకు ఎందుకున్నాయ్?" అని రెప్పలు అల్లల్లాడించుకుంటూ అడుగుతుంది. దానికతను

"ఆకాశంలో బూజు పడుతుంది కదా! దాన్ని దులపడానికి!" అనేస్తాడు సింపుల్‌గా! అన్నట్లు ఆ సినిమా షూటింగంతా ఊటీలోనే!

షూటింగ్ స్పాట్ అని అక్కడ ఓ ప్రదేశం వుంది. నున్నగా వున్న కొండ, చుట్టూ దట్టంగా చెట్లున్న కొండలు... టోటల్లీ సూపర్బ్. అది సినిమాల్లో హీరో, హీరోయిన్లు కలిసి దొర్లుకుంటూ పోతారే ఆ కొండన్నమాట! వ్యూ మాత్రం అదిరింది! సినిక్ బ్యూటీకి మారుపేరనుకోండి! దాన్ని ఆస్వాదించాక మెల్లగా దిగొచ్చాం. అక్కడ మొక్కజొన్న పొత్తులు ఉడకబెట్టి... ఉప్పు, కారం జల్లి వేడివేడిగా అమ్ముతున్నారు. అంత చల్లటి ప్రాంతంలో! ఇక ఊరుకుంటామా, వెంటనే వాటి పనిపట్టాం.

మెల్లగా పైకారా ఫాల్స్ వైపుకు మళ్లాం. దానికి చాలా దూరం నడవాలట. దారిలో మన తెలుగువాళ్లే ఎదురై ఆ జలపాతం చిన్నగా వుందని చెప్పారు. సరే లెమ్మనుకుంటూ వెనుతిరిగాం. అక్కడ ఏం కనిపించాయో తెల్సా?! పిచ్చుకలు! పిచ్చుకలా అని తేలిగ్గా తీసిపాలేయకండి. పిచ్చుకలు అంతరించిపోతున్నాయని వినడం లేదూ?! మీరు పిచ్చుకల కిచకిచారావాలు విని ఎన్నాళ్లైంది చెప్పండి? పైగా ఆ పిచ్చుకలు బొద్దుగా భలే ముద్దొచ్చాయి. అడవిలో పెరగడం కదూ! ఇటీవల మన జనవాసాలలోనూ పిచ్చుకలు అక్కడక్కడ మళ్లీ కనిపిస్తున్నా అవి డైటింగ్ చేస్తున్న పిచ్చుకల్లా వున్నాయి. మునుపటి హుషారు లేదు.

ఇక 'చలో పైకారా లేక్' అన్నాం. పైకారా లేక్... "ఏమని వర్ణించనూ..!" ఒక చేయి తిరిగిన చిత్రకారుని కుంచె నుండి అలవోకగా జాలువారిన చిత్రమంటే సరిపోతుందా?! అనుమానమే! అం..త గొప్పగా వుందా సరస్సు. ప్రకృతి ఎంతో శ్రద్ధగా తీర్చిదిద్దిన ఆ రంగవల్లికను ఊపిరి బిగబట్టి కళ్లనిండా నింపుకోవడమే సరిపోయింది. అదే గొప్ప



పైన్ ఫారెస్ట్

అనుకుంటే... అందులో బోటింగ్! అందరం జంగ్లీలో షమ్మీకపూర్‌లా 'యాహూ' అని అరిచి బోట్‌లో సెటిలైపోయాం. చుట్టూ చిక్కనైన చక్కదనమే! అణువణువునా పచ్చదనమే... అవును పచ్చదనమే..! ప్రకృతిని చూసి పరవశించే ప్రతివారూ అక్కడ తన్మయం చెందాల్సిందే! ఆ మైమరపులోనే బోటింగ్ పూర్తయింది.

తరువాత నీడిల్ రాక్ వ్యూ పాయింట్. అక్కడికి చేరేసరికి ఒకటే వాన. ఆ వానలో తడుచుకుంటూ కొండవాలు దిగాం. వెహికల్‌లోని గొడుగులు తీసుకోవాలన్న ఆలోచన కూడా రాలేదేంటో! కొంతదూరం నడిచాక ఆ పాయింట్‌కు చేరాం. వాన, మబ్బుల మధ్యగా దూరంగా మొనతేలిన కొండ... ఓ వర్ణచిత్రంలా మా గొప్ప సొగసుగా వుందిలే! చూస్తూ వుండిపోవడానికి జోరున వర్షం. ఇక తిరిగిరాక తప్పలేదు.

అన్నట్లు మొత్తం టూరంతా ప్రతిచోటా 'ప్లాస్టిక్ ప్రొహిబిటెడ్ ఏరియా' అని బోర్డులు కనిపించాయి. అది వుండబట్టే ఈమాత్రం ఈ అడవులు మనగలుగుతున్నాయి. లేకుంటేనా... 'సర్వనాశనం' అయిపోయి వుండేది. వరదలు రావడానికీ, పశువులు చనిపోవడానికీ, నేలంతా పాడైపోవడానికీ ప్లాస్టిక్ భూతం చేస్తున్న హాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాగే అంతటా కొండలు, చెట్లు, పువ్వులు ఎలా పెరిగేవి అలాగే వుంచారు. చెట్లను కాపాడమని హోర్డింగులుంచారు. పువ్వు చూస్తే కోయాలనుకోవడం, కాయ చూస్తే తెంచాలనుకోవడం వరకూ ఓకే! దానివల్ల ఎలాంటి నష్టం రాదు. పర్యావరణానికి ఎలాంటి భంగమూ వాటిల్లదు. కానీ... ఆ చెట్టే నరికేస్తే, కొండే తవ్వేస్తే ఎలా? కూర్చున్న కొమ్మను నరుక్కున్న కాళిదాసు గురించి విని ఎగతాళిగా నవ్వుకున్నాం. మరి మనం చేస్తున్నదేంటో!

అలా అలా సాగుతున్న మా ప్రయాణం వున్నట్టుండి క్రమేణా దట్టంగా అల్లుకున్న వెదురు పొదల్లో సాగింది. ఎంత దట్టంగా అంటే ఆకాశం కనపడనంతగా! రోడ్డుకిరువైపులా వున్న పొదలన్నీ ఏకమైపోయి దారిని చీకటిమయం చేసేశాయి. కానీ రాదారి మాత్రం బహు రమణీయంగా వుంది. అలా వెళ్తూ వెళ్తూ దట్టమైన ముదుమలై అడవుల్లోకి అడుగుపెట్టాం. అదంతా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్. ఎక్కడా దిగే సాహసాలు కూడదు. కేవలం అడవి అందాలను కళ్లతో జుర్రుకోవాలంతే! దారిలో ఓ అడవి ఏనుగు తన రెండు బుజ్జాయిలతో కనిపించింది. కళ్లు ఇంతింత చేసుకుని మరీ చూశాం. మెల్లగా గుడలూరు మీదుగా తెప్పకాడుకు చేరాం.

కానీ పడుకోవాలంటే చెప్పలేనంత భయం. ఎటువైపునుండి ఏ భల్లూకం వస్తుందో, ఏ పక్కనుండి అడవి జంతువు 'హల్లో' అంటుందోనని వణుకు, దడ, గగుర్పాటు. బాబోయ్!

(తెల్లవారుజామున గది తలుపులు తీయగానే ఏం కనిపించాయో తెలియాలంటే వచ్చేవారం వరకూ ఎదురుచూడక తప్పదు)



పైకారా లేక్...

దేశం నిండుగ దీపాల పండుగ

-కె . సాహిల్

దసరా వెంట వచ్చే ప్రధానమైన పండుగ దీపావళి. మరే పండుగకూ లేని ప్రత్యేకత ఒకటి దీపావళికి వుంది. అమావాస్య చీకట్లను తరిమివేసే రంగురంగుల కాంతులే దీని స్పెషల్. పెద్ద పెద్ద శబ్దాలు చేసే టపాసులు, అందాలు విరజిమ్మే తారాజువ్వలు, క్షణానికోచోట నాట్యం చేసే భూచక్రాలు, ఆకాశాన్ని ముద్దాడాలని ముచ్చటపడే చిచ్చుబుడ్లు .... దీపావళిని జనరంజకమైన పండుగగా చేస్తాయి. దేశవ్యాప్తంగా చిన్నారులకే కాక పెద్దలకూ అత్యంత ఇష్టమైన పండుగ ఇది. మనది వ్యవసాయ ప్రధాన రాష్ట్రం కనుక సంక్రాంతినే అత్యంత ప్రధానమైన పండుగగా జరుపుకుంటాం. దీపావళిని ఒక్కరోజులోనే ముగించేస్తాం. కానీ ఈ పండుగను ఐదేసి రోజుల పాటు జరుపుకునే రాష్ట్రాలున్నాయి. మరి మన పొరుగు రాష్ట్రాలవారు ఈ పండుగను ఎలా చేస్తారో చూద్దామా...

చెడు మీద మంచి సాధించిన విజయానికి చిహ్నామే దీపావళి. సాధారణంగా అక్టోబర్-నవంబర్ మధ్యలో వస్తుంది. అప్పుడే శీతాకాలం మెల్లగా మొదలౌతుంటుంది. ఎండ వానల తర్వాత వచ్చే ఈ చల్లటిగాలులు ఆహ్లాదకరంగానే వుంటాయి. సరిగ్గా ఈ సమయంలో దీపాల పండుగ జరుపుకోవడం ఎంతో అద్భుతం. చిన్నారులైతే ఏమేం టపాసులు కొనాలి? ఏం చేయాలో? ముందుగానే ప్రణాళిక వేసుకొంటారు. బాణాసంచా కొన్న దగ్గరనుంచి వాటిని ఎండబెట్టుకొంటూ ఎప్పుడెప్పుడు కాలుద్దామా అని ఉవ్విళ్లూరుతుంటారు. పండుగరోజు తెల్లవారుఝామునే లేచి నరకుణ్ణి కాల్చుతారు. తర్వాత స్నానాదికార్యక్రమాలు ముగించుకొని కొత్తబట్టలు వేసుకొని తీపి పదార్థాలు ఆరగించి సాయంత్రం ఎప్పుడౌతుందా అని ఎదురుచూస్తుంటారు. మట్టి ప్రమిదలు వెలిగించి గుమ్మాల పక్కన, గోడలమీద పెడతారు. లక్ష్మీపూజ చేస్తారు. చీకటిపడ్డాక టపాసులు కాల్చేటప్పుడు పొందే ఆనందం అంతా ఇంతా కాదు. మన రాష్ట్రంలో సంగతి ఇది. మరి మన పొరుగు రాష్ట్రాలలో దీపావళిని ఎలా ఆస్వాదిస్తారో చెప్పుకుందాం!

టీ తోటలకు పేరుగాంచిన అస్సాంలో దీపావళిని మట్టి ప్రమిదలు, మిఠాయిలు, టపాసులతో జరుపుకొంటారు. ఇంటిల్లపాదీ పెందలాడే లేచి స్నానాలు ముగించి కొత్తబట్టలు ధరిస్తారు. అష్ట ఐశ్వర్యాలను అందించమని లక్ష్మీదేవిని పూజిస్తారు. సాయంత్రం అయిన దగ్గర నుంచి ఇంటిని చిన్ని చిన్న విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. మట్టిదీపాలుకూడా వెలిగిస్తారు. అంతేకాకుండా ఇంటి బయట దీపాలను వేళ్లాడదీస్తారు. ఇవి దుష్టశక్తులను అడ్డుకుంటాయని, అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తాయని విశ్వసిస్తారు. ఇంటి గుమ్మాలను మామిడాకులు, బంతిపూల తోరణాలతో అలంకరిస్తారు. అతిథులను ఆహ్వానించడానికి వాకిట్లో రంగురంగుల రంగవల్లికలు వేస్తారు. వ్యాపారాలు చేసుకొనేవారు ఆరోజునే కొత్త పొద్దుల పుస్తకాలు ప్రారంభిస్తారు. నూతనంగా చేపట్టే పనులేవైనా వుంటే ఆరోజునే మొదలెడతారు.

బీహార్‌లో రెండు రోజుల ముందరే దీపావళి వేడుకలు మొదలౌతాయి. ధన త్రయోదసి రోజున నూతన వంటపాత్రలు తీసుకొచ్చి పూజగదిలో వుంచుతారు. ఉదయం స్నానాలు చేసిన దగ్గరనుంచి ఉపవాసం వుంటారు. సూర్యాస్తమయం తర్వాతే మిఠాయిలు, పూరీలు వంటి రుచికరమైన వంటకాలను సుష్టుగా భుజిస్తారు. దీపావళి ముందు రోజును చిన్న దీపావళిగా పిల్చుకుంటారు. ఆరోజున నామకః టపాసులు కాల్చుతారు. మరునాడు ఇంటిని అందంగా అలంకరిస్తారు. వాకిట్లో రంగురంగుల ముగ్గులు వేస్తారు. వరిపిండితో చిన్న చిన్న పాద ముద్రలు వేస్తారు. వాటిని లక్ష్మీదేవి చిహ్నాలుగా భావిస్తారు. ధనలక్ష్మి అలా ఆ పాదముద్రలమీదగా తమ ఇంట్లోకి



ప్రవేశిస్తుందని విశ్వసిస్తారు. నెయ్యి, నూనెతో మట్టి దీపాలు వెలిగిస్తారు. పూజ అనంతరం వీటిని తులసి కోట ముందు, ప్రతి గుమ్మానికి ఇరువైపుల, ఇంటి చుట్టూ అలంకరిస్తారు. అనంతరం నేస్తాలను కలుసుకొని మిఠాయిలు పంచి దీపావళి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఇక చివరి కార్యక్రమంగా టపాసులు కాల్చి ఆనందిస్తారు.

రాజధాని ఢిల్లీలో దసరా అప్పుడే దీపావళి ఏర్పాట్లు మొదలౌతాయి. ఇళ్లను, షాపులను తిరిగి అలంకరించడం, సున్నాలు కొట్టించడం...షాపింగ్ చేయడంతో అంతా హడావిడిగా వుంటుంది. ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటించడంతో షాపులు కిటకిటలాడతాయి. దీపావళిరోజున ధరించడానికి కొత్త బట్టలు కొనుగోలు చేస్తారు. ఇక్కడ కూడా ధన్‌తేరస్ రోజున వంట సామాను కొంటారు. దీపావళి రోజున మధ్యాహ్నం వరకు షాపులు తెరచే వుంటాయి. ఆరోజున అమ్మకాలు బాగా వుంటే సంవత్సరమంతా వ్యాపారం బావుంటుందని నమ్ముతారు. మిఠాయిలు, ఎండు ఫలాలు, వెండి నాణేలు బహుమతులుగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ బహుమతులు స్థాయినిబట్టి వుంటాయి. వెండి వస్తువులు, ఇంటి సామగ్రి, బట్టలు కూడా ఇచ్చుకునేవారుంటారు. ప్రతి వీధి చివరన రామలీల గాథకు సంబంధించిన విగ్రహాలను వుంచుతారు. దీపావళి రోజున మహిళలు భర్తకు తిలకం దిద్ది హారతి ఇస్తారు. అతని దీర్ఘాయుష్షు కోసం ప్రార్థిస్తారు. పాలు నింపిన పాత్రలో వెండి నాణెం వేసి...ఆ పాలను అన్ని గదుల్లోను చిలకరిస్తారు.

పంజాబ్‌లో మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా దీపావళి జరుపుకొంటారు. ఏర్పాట్లు ముందుగానే జరిగిపోతాయి. జిలిబిలి వెలుగుల దీపాలతో కళ్లు జిగేల్‌మంటాయి. సంప్రదాయ ముగ్గులతో ఇంటిలోగిళ్లు శోభాయమానమౌతాయి. సంపదలను అందించమని లక్ష్మీదేవిని వేడుకొంటారు. గ్రామాలలో మాత్రం ఆరోజున పశువులను పూజిస్తారు. శీతాకాలపు పంటలు చేతికందుతాయి కనుక దీపావళిని టిక్కా పండుగగా జరుపుకుంటారు. ఎటువంటి చెడు జరగకుండా ఆరోజున అప్పచెల్లెళ్లు సోదరులకు కుంకుమ దిద్దుతారు. ఇంక టపాసుల సంగతి చెప్పేదేముంది!

ఒరిస్సాలో కూడా అందరికిలాగే దీపావళి పండుగను ఆస్వాదిస్తారు. కొవ్వొత్తులు, మట్టిదీపాలు, విద్యుత్ దీపాలు, మిఠాయిలు, టపాసులు అన్నీ వుంటాయి. కాకపోతే ఇక్కడో ప్రత్యేకత వుంది. ఆరోజున చీకటిపడిన వెంటనే కుటుంబ సభ్యులంతా ఒకచోటికి చేరతారు. వాకిట్లో పడవ ముగ్గు వేస్తారు. అందులో ఏడు గదులుంటాయి. పత్తి, ఉప్పు, పసుపు, ఆవాలు, చెట్టు కొమ్మ, తోటకూరను ఒక్కో గదిలో వుంచుతారు. మధ్య గదిలో ప్రసాదం పెడతారు. దానిమీద గుడ్డ ముక్క కట్టిన జనుము కొమ్మను వెలిగిస్తారు. ప్రతి ఒక్కరూ వెలిగించిన జనుము కొమ్మను ఆకాశంవైపు చూయిస్తూ 'బడా బడువా హో...' అంటూ పాట పాడతారు. సూక్ష్మరూపంలో తమను చూడ్డానికి వచ్చిన పితృదేవతలను ఈ వెలుగు తిరిగి స్వర్గానికి తీసుకెళ్తుందని నమ్ముతారు.

రాజస్థాన్ అంటేనే పండుగులకు, పర్వదినాలకు పెట్టింది పేరు. ఇక్కడ ప్రధానమైన పండుగలలో దీపావళి ఒకటి. గృహాలంకరణ, మిఠాయిలతోపాటు మిత్రులను కలవడం కూడా వుంటుంది. స్నేహితులంతా కలిసి రొటీన్‌కు భిన్నంగా ఆనందోత్సాహాలతో గడుపుతారు. సాధారణంగానే ఆరోజుటి వంటకాల జాబితా ఎక్కువగానే వుంటుంది. మహిళలు ఇరుగుపొరుగుతో కలిసి మిఠాయిలు వండుతారు.

మహారాష్ట్రలో దీపావళి మిగతారాష్ట్రాలకు



ఏ దేశమేగినా...

ఏ దేశంలోనైనా దీపావళి దీపావళే. కాకపోతే ఆచార వ్యవహారాల్లో తేడాలుండొచ్చు. అలాగే ఆచరించే తేదీల్లోనూ మార్పులుండొచ్చు. కానీ ఆనందోత్సాహాల్లో మాత్రం కుసింత కూడా తేడా వుండదు. మరి దీపావళిని ఏ దేశంలో ఎలా జరుపుకుంటారో చూద్దామా!

పడవ షికారు

జపాన్‌లో దీపావళి పండుగ సెప్టెంబర్ మాసంలో వస్తుంది. ఇది తమకు అష్ట ఐశ్వర్యాలను తీసుకొస్తుందని జపనీయుల నమ్మకం. ఆ రోజున వారు తోటల్లోకెళ్లి చెట్ల కొమ్మలకు లాంతర్లు వేళ్లాడదీస్తారు. తెల్లవార్లూ ఆటపాటలతో గడుపుతారు. కొత్త బట్టలు వేసుకొని పడవ షికారు చేయడం వారి ఆచారం. తమాషా ఏంటంటే పండుగనాడు మాత్రం ఇంటిని శుభ్రం చేయరు. వాల్‌పేపర్లతో అలంకరిస్తారు.

మనలాగే...

మారిషస్, మయన్మార్‌లలో మాత్రం దీపావళిని మనలాగే పర్వదినంగా భావిస్తారు. రాముడు పట్టాభిషిక్తుడయ్యాడని చెప్పుకొనే రోజుకి ముందే ఈ పండుగ చేసుకొంటారు. మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. వీటితో రకరకాల ఆకృతులూ చేస్తారు. లక్ష్మీదేవిని పూజించి టపాసులు కాల్చుతారు.

5 రోజుల పండుగ

నేపాల్‌లో దీపావళిని తిహార్‌గా జరుపుకుంటారు. ఐదు రోజుల పాటు చేస్తారు. తొలి రెండు రోజులు కుక్కలకు మంచి ఆహారాన్ని పెడతారు. హంసల్ని మాత్రం భైరవుడికి ప్రతిరూపంగా భావిస్తారు. ముచ్చటగా మూడవ రోజు మట్టి దీపాలతో ఇళ్లను అలంకరిస్తారు. లక్ష్మీదేవిని పూజిస్తారు. నాల్గవ రోజున యముడిని వేడుకొంటారు. చివరి రోజున కుటుంబ సభ్యులంతా కలిసి సంతోషంగా గడుపుతారు.

క్రియోకా...

థాయ్‌లాండ్‌లో అక్టోబర్ – నవంబర్ నెలలో ఈ పండుగను క్రియోకా పేరుతో జరుపుకొంటారు. అరటి ఆకుల్ని దొప్పలుగా చేసి కొవ్వొత్తులు వెలిగిస్తారు. ధూపం వేసి వాటిని నీళ్లల్లో వదులుతారు. నాణేలనూ నీటిలో వేస్తారు. శుభాకాంక్షలు తెలుపుకొంటూ మిఠాయిలు పంచుకొంటారు.

ఐదు రోజుల పండుగ 'కథా'కళి

దీపావళి అనేక ప్రాంతాల్లో ఒక్కరోజు టపాసుల మోతలకే పరిమితమైనా...కొన్ని చోట్ల మాత్రం ఏకంగా ఐదు రోజులు సాగే పండుగ. ఒక్కో రోజుకు ఒక్కో కథ. అంతేనా! ఒక్కో పూజ. దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకొనే పండుగకు సంబంధించి ఎన్నో కథలు ప్రచారంలో వున్నాయి. మరి ఆ కథలేంటో...ఏ రోజున ఏ పూజను ....ఎక్కడెక్కడ ఏవిధంగా చేస్తారో... చూద్దాం.

తొలిరోజు ...ధన త్రయోదశి

దీపావళి తొలిరోజును ధన త్రయోదశి అంటారు. క్షీరసాగర మధనంలో అమృతభాండాన్ని తీసుకొని బయటకు వచ్చిన దేవతల వైద్యుడు ధన్వంతరిని ఈరోజు కొలుస్తారు. అనారోగ్యం, మరణం లేని అమృతాన్ని అందించినందుకు ధన్వంతరిని పూజిస్తారు. మరో కథ కూడా ప్రచారంలో వుంది. హిమరాజ కుమారుడిని యముడి పాశం నుంచి కాపాడుకోవడానికి అతని భార్య ప్రయత్నించి విజయం సాధిస్తుంది. అందుకుగాను తన నగలన్నీ గుట్టగా పోసి వాటి చుట్టూ లక్షలాది దీపాలు వెలిగిస్తుంది. అందుకే ఈ రోజున ఏదైనా బంగారు ఆభరణాలు కొనడాన్ని శుభసూచికంగా భావిస్తారు.

రెండవరోజు...నరకచతుర్దశి

దీపావళి రెండవరోజును నరకచతుర్దశి లేదా చిన్న దీపావళి అంటారు. ఈరోజు వెనక ప్రచారంలో వున్న గాథ అందరికీ తెలిసిందే. నరకాసురుడి బాధలు పడలేక ప్రజలు శ్రీకృష్ణుడిని వేడుకోగా...సత్యభామా సమేతంగా యుద్ధానికి వెళతాడు. ఆ యుద్ధంలో సత్యభామ నరకుణ్ణి వధిస్తుంది. అందుకు ప్రతీకగా నరకచతుర్దశిని జరుపుకుంటాం.

మూడవరోజు...లక్ష్మీపూజ

దీపావళి పర్వదినాలలో అత్యుత్తమమైనది మూడవరోజు. అదే దీపావళి. ఈరోజునే లక్ష్మీపూజ జరుపుకుంటారు. పద్నాలుగేళ్ల అరణ్యవాసం అనంతరం సీతాలక్ష్మణ సమేతంగా శ్రీరాముడు అయోధ్యకు వచ్చిన రోజును దీపావళి అని కూడా అంటారు. పాండవులు అజ్ఞాతవాసం పూర్తిచేసుకుని తిరిగి వచ్చింది కూడా దీపావళి రోజునే అని అంటారు. ఈరోజు అమావాస్య అయినప్పటికీ ఎంతో విశిష్టత వున్న పర్వదినంగా పాటిస్తారు.

నాల్గవరోజు...గోవర్ధన పూజ

దీపావళి మరుసటి రోజును 'పాడ్వా లేక వర్షపాద' అని అంటారు. ఇది విక్రమాదిత్యుడు పట్టాభిషిక్తుడైన రోజుగా చెప్తారు. ఆరోజునే విక్రమాదిత్యుడి యుగం ప్రారంభమైనట్టుగా కూడా అంటారు. దీన్ని పురాణాల ప్రకారం గోవర్ధన గిరిని కృష్ణుడు ఎత్తిన రోజుగా కూడా భావిస్తారు.

ఐదవ రోజు...భ్రాతృద్వితీయ

చివరి రోజు అయిన ఐదవ రోజున 'భావ్ బిజ్ లేక భయ్యా దూజ్' (భ్రాతృ ద్వితీయ)గా జరుపుకుంటారు. ఇది తోడబుట్టిన వారితో ప్రేమానురాగాలను పంచుకొనే రోజు. దీని వెనకా ఓ పురాణగాథ ప్రచారంలో వుంది. ఇదే రోజున యముడు తన సోదరి యమి ఇంటికి వెళ్లగా ఆమె ఆయనకు తిలకం దిద్ది స్వాగతించిందట. అందుకు ఉప్పొంగిపోయిన యముడు ఒక వరమిచ్చాడట. అదేమంటే దీపావళి ఐదవ రోజున తన సోదరి చేత కుంకుమ దిద్దించుకొన్న వారి జోలికి వెళ్లను అన్నాడట. అప్పటి నుంచి సోదరసోదరీ బంధాన్ని పెంచే ఉత్సవంగా ఇది మొదలైంది.

భిన్నంగా జరుపుకొంటారు. మరాఠీ క్యాలండర్ ప్రకారం 'వసు బరస్' రోజున దీపావళి ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఆరోజున వివాహితలు గోపూజ చేస్తారు. తమను, తమ సంతానాన్ని కాపాడుతున్నందుకుగాను అలా వాటిని పూజిస్తారు. ధనత్రయోదసిని ఇక్కడ ధన్ తేరస్ అని పిలుస్తారు. ఈరోజున యమ దీప దానం చేస్తారు. సాయంత్రంపూట దీపం వెలిగించి యముడిని పూజిస్తారు. భర్తలకు సంపూర్ణ ఆయుష్షు ప్రసాదించమని వేడుకొంటారు. చిన్న దీపావళిని నరకచతుర్దసిగా పిల్చుకుంటారు. ఆరోజున అభ్యంగన స్నానమాచరిస్తారు. చందనం, రోజాపూలు, పసుపుతో చేసిన పిండితో స్నానం చేస్తారు. సబ్బు ఉపయోగించరు. దీపావళి నాడు లక్ష్మీపూజ చేస్తారు. ఆ సాయంత్రం తమ సంతోషానికి గుర్తుగా భర్త భార్యకు ఏదైనా చక్కటి బహుమతిని అందిస్తాడు. చివరి రోజున తమ సోదరులకు దీర్ఘాయుష్షును కోరుతూ ఆడపిల్లలు పూజలు చేస్తారు. దీనికి బదులుగా అబ్బాయిలు తమకు కలిగినంతలో వారికి బహుమతులు అందిస్తారు. దీపావళి ముగింపు ఉత్సవం తులసిచెట్టు వివాహంతో మొదలౌతుంది.

గుజరాత్‌లో దీపావళిని ఐదు రోజులపాటు జరుపుకుంటారు. తొలిరోజున ధన త్రయోదసి, రెండవరోజున కాళి చౌదాస్, మూడవ రోజున దేవ దివాళి, నాల్గవ రోజున గుడి పడ్వా, ఐదవ రోజున భ్రాతృ ద్వితీయ చేస్తారు. సంపదలు అందించే లక్ష్మీపూజ తప్పనిసరి. లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ ఇంటి ముందు అందమైన ముగ్గులు వేస్తారు. వరి పిండి, పసుపుతో పాదముద్రలు వేస్తారు. ఇంటిని దీపాలు, పూలు, రంగు కాగితాలతో అలంకరిస్తారు. ఆ నెల మొత్తం షాపులన్నీ కస్టమర్లతో నిండుగా వుంటాయి. నాల్గవరోజునే వారు నూతన సంవత్సర వేడుకలు కూడా జరుపుకొంటారు. దీపావళి రోజున స్త్రీపురుషులు తమ సంప్రదాయ దుస్తులు ధరిస్తారు.

ఇలా ప్రతి రాష్ట్రంలోనూ దీపావళిని జరుపుకొంటారు. విశ్వాసాలు, నమ్మకాలు వేరైనా అంతా కోరుకొనేది ఒక్కటే. ఐశ్వర్యారోగ్యాలే. సంపదకోసం, ఆయుష్షుకోసం పూజలు చేయడం మనకు కనిపిస్తుంది.

★

కిస్‌మిస్ కేసరి

కావలసిన వస్తువులు

కిస్‌మిస్ - 200 గ్రాములు
పాలు - అర కప్పు
బొంబాయిరవ్వ - పావుకిలో
పంచదార - పావుకిలో, నెయ్యి - పావుకిలో
జీడిపప్పు - 100గ్రా, యాలకులు - 5
మిఠాయిరంగు - కొంచెం

తయారుచేసే విధానం

కిస్‌మిస్ నేతితో వేయించుకోవాలి. మూకుడులో కొద్దిగా నెయ్యి పోసి రవ్వని కూడా వేయించాలి. రవ్వ కొద్దిగా వేగితే చాలు. ఒక పాత్రలో పాలు పోసి మరగబెట్టాలి. మరుగుతున్న పాలలో రవ్వ వేసి కలియబెడితే బాగా వుడుకుతుంది. అందులో పంచదార, వేయించిన కిస్‌మిస్, జీడిపప్పు వేసి కలియ బెట్టాలి. కొద్దిగా ఆగి నెయ్యి, పాలలో కలిపిన మిఠాయిరంగు, యాలకుల పొడి చేసి మళ్ళీ కలియబెట్టాలి. కిస్‌మిస్ రవ్వ కేసరి పొడిపొడిలాడుతూంటే బాగుంటుంది. నీళ్ళు ఎక్కువయితే గుజ్జుగా అవుతుంది. ఇది కూడా తినడానికి బాగుంటుంది.

కిస్‌మిస్ ఎక్కువ పాలు కలపడంచేత తీపి ఎక్కువగా వుంటుంది.

చంద్రకాంత

కావలసిన వస్తువులు

పెసరపప్పు - 100 గ్రాములు, పంచదార - 100 గ్రాములు, జీడిపప్పు - 1 స్పూన్, యాలకులు - 5, కుంకుమపువ్వు - చిటికెడు, కొబ్బరి-ఒక చెక్క, నెయ్యి-పావుకిలో.

తయారుచేసే విధానం

పొట్టులేని పెసరపప్పు తీసుకుని బాగా నాననివ్వాలి. నానిన పప్పును మెత్తగా రుబ్బాలి. కొబ్బరికోరు, పెసరపిండి, పంచదార కలిపి పాత్రలో వుంచి పొయ్యిమీద పెట్టి బాగా కలబెట్టాలి. గట్టిగా ముద్దలాగా అయ్యేవరకు ఇలా తిప్పుతూ వుండాలి. ఇప్పుడే వేయించిన జీడిపప్పు, యాలకులపొడి, పాలల్లో రంగరించి కుంకుమపువ్వు వేసి దింపెయ్యాలి. శుభ్రంగావున్న పలచటిగుడ్డని తీసుకుని నీళ్ళలో తడపాలి. నీళ్ళు లేకుండా పిండేసిన ఆ తడిగుడ్డను ఒక పీటమీద పరచాలి. దానిమీద ఈ పిండిముద్దని సరిసమానంగా పరచాలి. కావలసిన ఆకారంలో చాకుతో కొయ్యాలి. వెంటనే చల్లారిపోతుంది. బూరెలమూకుడులో నెయ్యి పోసి బాగా మరగించాలి. మరుగుతున్న నెయ్యిలో ఈ ముక్కలు వేయిస్తే బాగా పొంగుతాయి. గుల్ల విచ్చుతాయి. చల్లారిన తర్వాత తినడానికి చాలా బాగుంటాయి.

జిలేబీ

కావలసిన వస్తువులు

మైదాపిండి- పావుకిలో, బియ్యప్పిండి - 2 టేబుల్ స్పూన్లు, పంచదార- 1 కిలో, నెయ్యి - పావు కిలో, సోడా - చిటికెడు, పుల్ల మజ్జిగ - అర కప్పు, మిఠాయిరంగు - కొంచెం.

తయారుచేసే విధానం

ఇది అప్పటికప్పుడు చేసుకుతినే పదార్థంకాదు. ఒకరోజు ముందు ప్రిపరేషన్ కావాలి. ముందుగా మైదాపిండి, బియ్యప్పిండి కలిపి నీళ్ళు, మజ్జిగ పోసి నానబెట్టాలి. ఇందులోనే సోడా కూడా వెయ్యాలి. బాగా నానే కొద్దీ పులుసువాసన వస్తుంది. బురబురలాడుతూ వుంటుంది. తీగెలా సాగ కూడదు. ఇదే సరయిన పదును. ఈ పిండిని పాత్రలో పోసి బాగా చిలక్కొట్టాలి (కవ్వాన్ని ఉపయోగించవచ్చు). నురగ వచ్చేవరకూ చిలక్కొట్టాలి. ఎంత చిలక్కొడితే జిలేబీ అంత బాగా గుల్ల విచ్చుతుంది.

మెరకగావున్న మూకుడులో నెయ్యిపోసి బాగా కాచాలి. ఒక కొబ్బరిచిప్ప తీసుకుని బెజ్జం గుండ్రంగా వుండేట్టు చూసుకోవాలి. బెజ్జాన్ని వేలితో మూసి పిండిలో ముంచాలి. ముంచిన పిండిని కాగుతున్న నెయ్యిమీదకి తెచ్చి వేలు తొలగిస్తే బెజ్జంలో నుండి పిండి ధారగా కారుతుంది. దానిని చుట్టుగా చుట్టవచ్చు. వీటిని బాగా వేగనివ్వాలి. అంతకుముందే ఒక పాత్రలో పంచదార, నీళ్ళు పోసి పాకం తియ్యాలి. ఈ పాకం ముదురు లేత కాకుండా వుండాలి. మిఠాయిరంగును పాలలో కలిపి ఈ పాకంలో వేస్తే రంగు వస్తుంది. పాకం వేడిగా వుండటం అవసరం. పైన చుట్టిన చుట్టలను ఈ పాకంలో వెయ్యాలి. వాయలు వాయలుగా వెయ్యవచ్చు. అయితే పాకంలో వేసిన వాయ తీసి వేరే పళ్ళెంలో పెట్టుకుంటే కొత్తవాయకి పాకం బాగా పడుతుంది. అంతా అయ్యాక అన్నీ కలిపి మళ్ళీ పాకంలో వేసుకోవచ్చు. అలా ఒక గంటసేపు పాకంలో నానితే జిలేబీలు బాగా గుల్ల విడిచి పాకం పీల్చుకుంటాయి. జిలేబీలకు వాడే పిండి బాగా మెత్తనిదై వుండాలి. నోట్లో పెట్టుకుంటే కరిగిపోవాలి. తినడానికి రుచిగా కావాలనుకుంటే ఈ మాత్రం కష్టపడాలి.



చెనే లడ్డూ

కావలసిన వస్తువులు

శనగ పిండి - పావు కిలో, పంచదార - 750 గ్రాములు, నెయ్యి - అర కప్పు, కిస్‌మిస్ - 50 గ్రాములు, యాలకులు - 5, జీడిపప్పు - 25 గ్రాములు.

తయారుచేసే విధానం

పంచదార మెత్తగా పిండిలా అయ్యేట్టు దంచాలి. కిసమిస్, జీడిపప్పు వేయించి వుంచుకోవాలి. మూకుడులో నెయ్యి వేసి బాగా కరిగిన తర్వాత శనగపిండి వేసి వేయించాలి. కొంచెం ఎర్రరంగు వచ్చాక పంచదార, జీడిపప్పు, కిస్‌మిస్, యాలకుల పొడివేసి బాగా కలబెట్టాలి. తర్వాత వుండలు వుండలుగా చేసుకోవాలి.

కథ

భయం

-డా॥ స్వాతి తివారీ

అనువాదం: శాంతసుందరి

పొద్దున్నే మంగళ గౌరి వ్రతం పూజ ముగించాక బంధువుల్లో అందరు పెద్దల కాళ్ళకి నమస్కారం చెయ్యటం మా ఇంటి ఆచారం. అందుకే నేను మా నాన్న స్నేహితుల ఇంటికి వెళ్ళాను. అసలు ఈ ఊళ్ళో వాళ్ళ ఇల్లే నాకు పుట్టిల్లు లాంటిది. వాళ్ళని నేను పిన్నీ, బాబాయి అని పిలుస్తాను. వాళ్ళు కూడా మా అమ్మా నాన్న వయసువారే. కూతుళ్ళూ, కొడుకులూ ఉన్నా ఎక్కడో దూరంగా ఉంటున్నారు. తాత ముత్తాతలనాటి ఆ పెద్ద బంగళాలో ఉండేది వాళ్ళిద్దరే.

అన్నేళ్ళు కలిసుండటం వల్లనేమో ఆయన ఆవిడ పట్ల అంత ప్రేమ కనబరచడు. కానీ ఆవిడ మాత్రం ఎప్పట్లాగనే భర్తకి అమర్చిపెడుతూ ఉంటుంది. బహుశా అది ఆవిడకి బాగా అలవాటైపోయి ఉండాలి. ఆయన అవసరాల పట్ల చాలా అప్రమత్తంగా ఉంటుంది. ఆవిడ మీద ఇంటి బాధ్యత మొత్తం ఉండటం వల్లనేమో, ఆవిడలో ఆరోగ్యకరమైన ఆలోచనలు చోటుచేసుకోవటంవల్ల మొహం మీద ముడతలు కూడా అట్టే లేవు.

ఒకప్పటి జమీందార్ల ఇల్లవటం చేత ఇంటినిండా వస్తువులు. రాజుల కాలంనాటి ఫర్నిచరు. చాలామటుకు పనికిరాని సామానే, అయినా చెత్తకింద అమ్మటానికి వాళ్ళు ఒప్పుకోరు. పిల్లలు తమ అభిరుచికి తగ్గట్టు కొత్త మోడల్ వస్తువులు కొని ఇల్లంతా నింపేశారు. ఈ సామానంతా వీళ్ళు వాడుకుంటారో లేదో తెలీదు కానీ, దాన్ని సంరక్షించే బాధ్యత మటుకు వీళ్ళ నెత్తి మీద పడింది. కోడళ్ళు వచ్చినప్పుడల్లా పనికిరాని సామాను తీసి విడిగా పెట్టి అమ్మాలని చూస్తారు. కానీ పిన్నో బాబాయో అడ్డం పడటంతో అవి అక్కడే ఉండిపోతాయి. అంత గట్టి చెక్కతో చేసిన మంచం ఇప్పుడెక్కడా దొరకదనో, ఆ చెక్కపెట్టె మా అత్తగారిచ్చిందనో, పిల్లలు వచ్చినప్పుడు క్యారంబోర్డు కావద్దా అనో ఏ వస్తువునీ అమ్మనివ్వరు వీళ్ళు.

సర్లెండి ఇవన్నీ మాట్లాడుతూ నేను అసలు విషయం చెప్పడం మరిచిపోతానేమో! అయితే మంగళగౌరి వ్రతం నాడు ఎప్పుడూ వెండి పళ్లెంలో ఇచ్చే ఫలహారం ఆ రోజు పింగాణీ పళ్లెంలో వచ్చింది. ముందు ఆశ్చర్యం వేసింది. పిన్ని మెడ వైపు చూశాను. బంగారు గొలుసుకి బదులు నల్లపూసలతో మంగళసూత్రం కనిపించింది. ఎలాగూ నా కళ్ళబడ్డాక అడక్కుండా ఉండలేక పోయాను.

"పిన్నీ మీ మెడలో గొలుసు...?" అన్నాను.

ఆమె రహస్యం చెపుతన్నట్లు, "మీ బాబాయికి చాదస్తం పెరిగిపోయిందమ్మా. ఇంత బంగారం పెట్టుకు తిరిగానంటే ఎప్పుడో ఏ దొంగాడో నన్ను చంపేస్తాడని అంటారు. మొత్తం నగలన్నీ లాకర్లో పెట్టించేశారు. ఈ వయసులో ఇప్పుడిదాక కొత్త భయం పట్టుకుంది !" అంది.

"అవును పిన్నీ, రోజులు బాగాలేవు మరి!" అని నేను కూడా బాబాయిని సమర్థించాను.

బాబాయి ఎదురుగ్గానే కూర్చుని ఉన్నారు. నన్ను నిశ్శబ్దంగా ఉండమని సైగచేసి, నన్ను దగ్గరకి రమ్మని పిలిచారు. పిన్ని టీ చేసేందుకు వంటింట్లోకి వెళ్ళింది. బాబాయి నెమ్మదిగా మంచం మీది పరుపు ఎత్తి, దానికింద దాచిన పేపరు బైటికి తీశారు. మొదటి పేజీలోనే ఊళ్ళో జరిగిన దొంగతనం, హత్య గురించి ఉంది... "వృద్ధ దంపతుల హత్య" అనే శీర్షికతో అచ్చయిన ఆ వార్త నేను కూడా చదివాను. అది నాలుగు రోజుల క్రితం పేపరు. అది చదివి నాకే రెండ్రోజులు నిద్ర పట్టలేదు. ముసలితనంలో కూడా భద్రత కరువైంది. ఇంట్లో కొచ్చే పనిమనిషి బైటికెళ్ళి ఎవరికేం చెపుతుందో? ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు?

పిన్ని టీ కప్పులతో వచ్చేసరికి పేపరు మాయం!

"ఏమంటున్నారమ్మా మీ బాబాయి?" అని అడిగిందావిడ.

నేను మాట మార్చి "మీరిద్దరూ మీ అబ్బాయి దగ్గరకెళ్ళి ఉండొచ్చు కదా?" అన్నాను.

నేనడిగిన ప్రశ్న బాబాయి మనస్సులో ఏమూలో ముల్లులా గుచ్చుకుంది. ఆయన మొహంలో హఠాత్తుగా ముడతలు ఎక్కువయినట్లనిపించింది నాకు. మా పెద్దబ్బాయి రోజూ ఫోన్ చేస్తాడు, అమ్మాయి ఆదివారం చేస్తుంది. ఇద్దరూ మా క్షేమం గురించి వాకబు చేస్తారు. మహా అయితే "ఇక్కడికొచ్చెయ్యండి" అంటారు. "డాక్టరుకి చూపిస్తాం, అమ్మకి కొంత విశ్రాంతిగా ఉంటుంది" అంటారు.

ఆయన ఉన్నట్టుండి లేచి నిలబడ్డాడు, బైటికి చూస్తూ,

"వచ్చెయ్యండి" అనటమే కాని, ఇక్కడికొచ్చి, "నాన్నా, నిన్నూ అమ్మనీ తీసుకెళ్ళటానికి వచ్చాను. పదండి. బైలుదేరండి" అని అనడు వాడు. అలా పిలిస్తే వెళ్ళటానికి మనసొప్పుతుంది. మర్యాదగా ఉంటుంది. ఇక ఈవిడకి కోడలు ఏటా రెండు చీరలు పంపిస్తుంది. అంతే అది చాలు ఈ అల్పసంతోషికి. నిజంగా వాడికి మా మీద ప్రేమా, ఒక్కళ్ళమే ఉన్నామనే బెంగా ఉంటే ఇలా మమ్మల్ని కాపలా పెట్టేవాడేనా ఈ ఇంటికి?"

"ఇంటిని పాడు పెట్టలేంకదా? ముత్తాతల కాలంనాటి దేవతల విగ్రహాలున్నాయి పూజామందిరంలో. అక్కడ రోజూ దీపం పెట్టే దిక్కు ఉండాలిగా? ఈయనగారు మొండికేస్తున్నారని పిల్లాడు ఉద్యోగం సద్యోగం లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ ఇక్కడ కూర్చుంటాడా పిచ్చి గానీ?" పిన్ని పిల్లలని వెనకేసుకొచ్చింది.

"ఊరు పాడైపోయిందమ్మా. నువ్వు కూడా ఒంటరిగా అటూ ఇటూ వెళ్ళకు" అని నా గురించి విచారం వెలిబుచ్చింది.

ఆమె లేచి వంట పని చూసేందుకు వెళ్ళింది. అది చూసి,

"ఏమైంది, రాఘవ రావటం లేదా? " అని అడిగాను.

"మీ బాబాయికి నేను తీరుబాటుగా కూర్చోవటం నచ్చటం లేదే.. అందుకే రాఘవని

అయితే మంగళగౌరి వ్రతం నాడు ఎప్పుడూ వెండి పళ్లెంలో ఇచ్చే ఫలహారం ఆ రోజు పింగాణీ పళ్లెంలో వచ్చింది. ముందు ఆశ్చర్యం వేసింది. పిన్ని మెడ వైపు చూశాను. బంగారు గొలుసుకి బదులు నల్లపూసలతో మంగళసూత్రం కనిపించింది. ఎలాగూ నా కళ్ళపడ్డాక అడక్కుండా ఉండలేక పోయాను.

"పిన్నీ మీ మెడలో గొలుసు...?" అన్నాను.

ఆమె రహస్యం చెపుతన్నట్లు, "మీ బాబాయికి చాదస్తం పెరిగిపోయిందమ్మా. ఇంత బంగారం పెట్టుకు తిరిగానంటే ఎప్పడో ఏ దొంగాడో నన్ను చంపేస్తాడని అంటారు. మొత్తం నగలన్నీ లాకర్లో పెట్టించేశారు. ఈ వయసులో ఇప్పుడిదొక కొత్త భయం పట్టుకుంది !" అంది.

"అవును పిన్నీ, రోజులు బాగాలేవు మరి!" అని నేను కూడా బాబాయిని సమర్థించాను.

బాబాయి ఎదురుగ్గానే కూర్చుని ఉన్నారు. నన్ను నిశ్శబ్దంగా ఉండమని సైగచేసి, నన్ను దగ్గరకి రమ్మని పిలిచారు. పిన్ని టీ చేసేందుకు వంటింట్లోకి వెళ్ళింది. బాబాయి నెమ్మదిగా మంచం మీది పరుపు ఎత్తి, దానికింద దాచిన పేపరు బైటికి తీశారు. మొదటి పేజీలోనే ఊళ్ళో జరిగిన దొంగతనం, హత్య గురించి ఉంది... "వృద్ధ దంపతుల హత్య" అనే శీర్షికతో అచ్చయిన ఆ వార్త నేను కూడా చదివాను. అది నాలుగు రోజుల క్రితం పేపరు. అది చదివి నాకే రెండ్రోజులు నిద్ర పట్టలేదు. ముసలితనంలో కూడా భద్రత కరువైంది. ఇంట్లో కొచ్చే పనిమనిషి బైటికెళ్ళి ఎవరికేం చెపుతుందో? ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు?

పిన్ని టీ కప్పులతో వచ్చేసరికి పేపరు మాయం!

"ఏమంటున్నారమ్మా మీ బాబాయి?" అని అడిగిందావిడ.

నేను మాట మార్చి "మీరిద్దరూ మీ అబ్బాయి దగ్గరకెళ్ళి ఉండచ్చు కదా?" అన్నాను.

పనిలోంచి తీసేశారు" అంది పిన్ని నిష్టూరంగా.

"ఎందుకు పిన్నీ?" అన్నాను.

"ఆయన్నే అడుగు! అంది విసుగ్గా.

"వాడి వంట తింటే కడుపులో మంట వస్తోంది. పైగా వాడు కూడా తిన్నగా ఉండడు. "ఈ పెట్టె ఊరికినే పడుంది. నాకు ఇవ్వకూడదా" అంటాడు. గ్యాసు లేకపోవటం వల్ల పెళ్ళానికి ఇబ్బందిగా ఉందట, "మీ దగ్గర రెండు కనెక్షన్లున్నాయి. నాకు ఒకటివ్వకూడదా" అంటాడు. వాడి దృష్టి ఎప్పుడూ మా దగ్గరున్న వస్తువులమీదే. ఏవైనా రెండేసి ఉంటే ఒకటి తనకిమ్మని అడుగుతాడు. ఇవ్వకపోతే ఆ కోపం వంటింట్లో గిన్నెల మీద చూపిస్తాడు. మా ఇద్దరికీ పెద్ద వంటేం ఉంటుందమ్మా? ఆ పాటి వంట ఈవిడ చెయ్యగలదు. రోజంతా ఊరికే కూర్చుని ఏం చేస్తుంది?" అన్నాడు బాబాయి.

లేచి చొక్కా వేసుకుని, చేతికర్ర తీసుకుని "నువ్వు ఇంక కాసేపు ఉండి వెళ్ళు. నేను అలా బ్యాంకు దాకా వెళ్ళి పెన్షన్ డబ్బులు తెస్తాను" అన్నాడాయన.

కానీ, వెళ్ళిన మనిషి ఐదు నిమిషాల్లో వెనక్కి వచ్చేశాడు. నేను ఆశ్చర్యపోతూ, "అప్పుడే వచ్చేశారేమిటి? ఏమైనా మరిచిపోయారా?" అన్నాను.

"లేదు తల్లీ! పెన్షన్ తీసుకుని ఆటోలో రావటం ప్రమాదం ఏమో, ఆటో వాడికి బ్యాంకు నించి వస్తున్నానని తెలిసిపోతుందేమో?"

"ఐతే పదండి. నా కారులో వెళ్దాం, నేను కూడా వస్తాను" అన్నాను ఆయనకి సాయం చేసే ఉద్దేశంతో.

"అబ్బే వద్దు, అప్పుడు ఈవిణ్ణి ఒక్కదాన్నీ ఇంట్లో వదిలి వెళ్లాల్సివస్తుంది. రేపు పనిమినిషి రాగానే పక్కింటి అబ్బాయి స్కూటర్ మీద వెళ్ళొస్తాలే!"

ఆయన మాటకి నేను అవాక్కయ్యాను.

"ఐతే పిన్నీ బాబాయీ మానసికమైన ఒత్తిడికి గురవుతున్నారా! అభద్రతాభావం విపరీతంగా పెరగటంవల్ల పట్టపగలు నాలుగడుగుల దూరంలో ఉన్న బ్యాంకుకి వెళ్ళేందుకు కూడా భయపడే స్థితికి చేరుకున్నారా? అరగంట సేపు భార్యని ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్ళాలంటే బాబాయి హడిలిపోతున్నాడు. ఒకప్పుడు ఈయనే వారంపాటు టూర్‌కి వెళ్ళేవాడు. పిన్ని ఒక్కతే అన్నీ చూసుకునేది.

అయితే పిన్ని మీద ప్రేమ లేనట్టు కనిపించటమంతా ఉత్తి నటనే అన్నమాట. ఆయనకి ఆవిడ మీద ఎనలేని ప్రేమ, అందుకే ఆవిడకి ఏ ప్రమాదం జరుగుతుందో అని అంత ఆందోళన ఆయనకి ! ఈ వయస్సులో ఇంత పెద్ద పట్నంలో ఒంటరిగా నిభాయించుకు రావటం కష్టంగా ఉన్నట్టుంది. లోలోపల ఏదో బలహీనత భయాన్ని పెంచుతున్నట్టుంది.

పక్క బంగళాలో పాండే ఉండేవాడు. ఆయన ప్రస్తుతం తన సొంతింటికి మారబోతున్నాడు. ఇక బాబాయికి విచారం పట్టుకుంది. ఆ ఇంట్లోకి ఎవరు వస్తారో, అని!

ఆపై వారం మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళాను. బాబాయి తన పడక్కుర్చీని వరండాలోకి మార్చాడు. అది కూడా పక్కిల్లు తనకి బాగా కనపడేట్టు దాని యాంగిల్‌ని అమర్చాడు.

"ఏమిటి బాబాయ్, ఇక్కడ కూర్చున్నారు? అన్నాను.

"చూడమ్మా, ఆ ఖాళీ ఇల్లు దయ్యాల కొంపలాగ లేదూ? ఎవడైనా ఇంట్లో దూరి రాత్రి డాబా మీదుగా మా ఇంట్లోకి చొరబడితేనో? అది సరే గాని, నీ దృష్టిలో ఎవరైనా మంచి సెక్యూరిటీ గార్డు ఉంటే చెప్పు"

"ఎందుకు బాబాయ్?"

"రాత్రిపూట ఇంటికి కాపలా ఉంటాడని పక్కింట్లో కూడా ఎవరూ లేరు కదా? మంచి వాళ్ళెవరైనా ఆ ఇంట్లో దిగితే అపుడు మానిపించేస్తానులే"

"కనుక్కుంటాను" అని లోపలున్న పిన్ని దగ్గరకి వెళ్ళాను. నన్ను చూసి ఆవిడ చిరునవ్వు నవ్వుతూ, "నీ గొంతు వినిపించిందమ్మా?" అంది.

బాబాయిగారితో మాట్లాడుతున్నాను. పిన్నీ."

"ఈ మధ్య మీ బాబాయు ఉద్యోగం చేస్తున్నారు. తెలుసా?"

"ఏమిటి?"

"నువ్వు చూడలేదా? కాపలాదారు పని చేస్తున్నారు.. పక్కింటి ప్రాపర్టీకి కునికి పాట్లు పడుతూనైనా సరే అక్కడే కూర్చునుంటారు. పగలంతా."

వాళ్ళని కలిసి ఇంటికి వెనక్కి వెళ్ళేప్పుడు మనసంతా కలత బారిపోయింది. నాకు. ఈ అభద్రతా భావం బాబాయికి చివరికి మతి స్థిమితం తప్పేంత స్థాయికి పెరిగిపోదు కదా? మనసుని పట్టి పీడించే ఈ ఒంటరితనం ఇంత భయంకరమైనదా? ఈ భయం చివరికి ఎక్కడికి తీసుకువెళ్తుంది... తల్చుకోటానికే భయం అనిపించింది. నాకు!

★

కొత్త పుస్తకాలు

గ్రామీణ భారతికి అద్దం

కాలాన్ని కలంతో నిద్రపోనివ్వని కవి డా॥ ఎన్. గోపి. తమ కుటుంబ మిత్రులైన గౌడ్ దంపతులకు ఆ కావ్యాన్ని అంకితం చేశారు. అరవై తెలుగు సంవత్సరాల్ని గుర్తుకు తెచ్చేలా అచ్చ తెలుగు పలుకుబడులతో మట్టి పరిమళ గుబాళింపులతో 60 చక్కటి కవితలను 108 పేజీల్లో అందించారు. తన షష్ఠ్యబ్ది పూర్తి సందర్భంలో ఈ కవితా సంపుటి వెలువరించడం కాకతాళీయమే కావచ్చు... మన పెద్దలన్నట్లుగా పల్లె తల్లి వంటిది. పట్నం ప్రియురాలు వంటిది. తల్లి మమకారాన్ని కీర్తిస్తూ ఎన్ని పుటలు రాసినా తక్కువే అవుతుంది. అలాంటి తల్లిలాంటి పల్లెను చక్కటి భావాలతో గోపి ప్రతి కవితను అద్భుతంగా అక్షరీకరించారు.

మా ఊరు మహాకావ్యం,
కవి : డా॥ ఎన్.గోపి, పేజీలు : 108,
వెల: 60/ రూ॥, ప్రతులకు : ఎన్.అరుణ,
13-1/5 బి, శ్రీనివాసపురం,
రామాంతపూర్, హైదరాబాద్-13/
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

ప్రజలకన్నా/నా కవిత్వం గొప్పదేం కాదు/ వారి పాదాలకన్నా/ నా కవిత్వ పాదాలు చురుకైనవేం కాదు... వారి పోరాట పటిమకన్నా! నాకవిత్వం తీవ్రమైందేం కాదు! (పేజీ.7) అంటూ కవి ఎంతో నిబద్ధత, నిజాయితీ, ఉద్యమాలపై సానుభూతి కవిత్వంలో అంతర్లీనంగా కనిపిస్తాయి. ఈ సంపుటిలో ద్వితీయ కవిత కూడా అద్వితీయంగా వుంది (పేజీ.9). 'ఉద్యమం గడ్డిపోచల ఆకాంక్ష/ రాజకీయం తుపాకుల ఆంక్ష! "నల్గొండ పల్లెల్లో/ మట్టిని గానం చేద్దామంటే/ ఫ్లోరోసిస్ జీవన విషాదం/ విహ్వల నాగేంద్రమౌతుంది (పేజీ.15) అంటారు "ఆ ఒక్క క్షణం" కవితలో కవి గోపి. అదే కవితలో.. 'నువ్వు నిల్చున్నది/ సెజ్జా? ముళ్ళ సెజ్జా !?" అని ప్రశ్నించే తత్వాన్ని కవిలో ఉండే తిరుగుబాటుధోరణిని ప్రతిబింబిస్తాయి.

పేదరికాన్ని చాలా మంది ఎ.సి గదుల్లో గ్లాస్ ఛాంబర్స్‌లో కూర్చొని మాట్లాడతారు. కవిత్వం రాస్తారు... కానీ గోపి "నడక" కవితలో ప్రతిపాదం అద్భుతంగా వర్ణిస్తారు... ప్రపంచంలో పేదరికం ఉన్నంత కాలం నిలిచే గొప్పకవిత ఇది.

"ఈ పైసలేకపోవడం/ మొదటి సారి కాదు! పుట్టినప్పుడు / మంత్రసానికివ్వడానికీ తండ్రికి పైసలేవు/ లేకపోవడమే ఒక అనాది ధర్మమై/ ఉంటే చుక్కలు చేతిలో రాలినట్టు !" (పే.21)

కాలాన్ని నిద్ర పోనివ్వని కవి గోపి 'దిగిరాను' కవితలో (పే.23) ఇలా అంటారు.

"మెరుపు నోరు తెరిచి / అరిచే మేఘమా!/ కురవకుండా! కులికితే ఏం లాభం?/ కాళిదాసును/ మహాకవిని చేసిన ఘన చరిత్ర నీది/ మరి రైతును రాజు చేసేది పోయి/ ఉరితాళ్లు పేనుతున్నావు" అంటారు.

అస్థిత్వ పోరాటాలు-సెంటిమెంట్ రాజకీయాలు నడిపే శక్తులు గోపిగారి "శాపగ్రస్త తెలంగాణ"లో అవగాహన చేసుకోవాల్సిన అంశాల్ని చక్కగా రాశారు... ఆలోచనలన్నీ/ అమెరికాలో/ పెత్తనాలన్నీ / ఇక్కడి అమరికలో/ ఇంతకూ మేధావులెవరు? నలిగినవాళ్లా!/ వెలిగేవాళ్ళా? సెంటిమెంటు/ రెచ్చగొట్టేవాడి సొత్తు కాదు!/ అది అమ్మంత పవిత్రమైంది.

ఇదే కవితలో మరోచోట చక్కటి తాత్విక బోధ చేస్తారు. ఫ్యూడల్ భూమి / కార్పొరేట్ భూమి/ ఫ్యాక్షన్ భూమి/ అలెగ్జాండర్‌ను మరిచావా?/ ఆరడుగుల జాగాలో/ జలుబుతో చచ్చాడు/ (పేజీ.26). ఉద్యమాలను హెలికాప్టర్ నుంచి గమనించే ప్రయత్నానికి నిరసనగా (పేజీ.80) భూమి వర్సెస్ ఆకాశం కవితలో కవి అభివ్యక్తి అద్భుతంగా వుంది.

"పై నుంచి చూస్తే/ దరిద్రం కూడా !
సముద్రమంత/ సుమనోహరం"

అంటారు.

"ఆ వర్తక నాట్యం" (మణిపురి మూల రచన) కవిత కళాకారులు, ముఖ్యంగా నాట్యరంగ కాళకారులు ఇది మాకవిత.. అని అంతరాన్ని స్పృశించుకోవాల్సిన స్థితి కనిపిస్తుంది.

"ఇక మునకలు వెయ్యంగాక వెయ్యం!
ఎందుకాడుతున్నామో తెలియదు మనకు!
అవును తెలియదు/ అయినా యుగాలుగా ఆడుతునే వున్నాం!

నిర్వికార ఆవర్తన నర్తనం - (పేజీ. 47) ప్రియమిత్రుడు పి. మోహనయ్యకు "సార్థకత" కవిత. సి.నా.రేకు అంకితంగా 'అకుంఠిత' మా ఆవిడ/ పతంజలిపై స్మృతి కవిత - "పుస్తకాలు" కవిత- (పేజీ.39) బాలగోపాల్‌పై రాసిన కవిత (పేజీ.48) కవితా సంపుటి యొక్క సీరియస్‌నెస్‌ను చల్లబరిచినట్లుగా పాఠకునికి తోస్తుంది. పండితులైన కవి వరేణ్యులే గమనించగలరు. "వాఘా సరిహద్దు" కవిత ఈ సంపుటిలో ఉన్న కవితల్లో అత్యుత్తమమైంది. "రోజంతా/ పదఘట్టనలతో/ పొక్కిలైన సరిహద్దు/ అలసటతో ఆవలిస్తుంది/ సరిహద్దును నిద్ర పుచ్చి/ భారంగా వెనక్కి కదుల్తారిద్దరూ! (పేజీ.54) ఆత్మబలిదానాలు "వద్దు బిడ్డా! చావొద్దు" అని (పేజీ.68) కవి చేసే సూచన ఆలోచింపజేస్తుంది. ఈ సంపుటిలో పేర్కొనాల్సిన మరో మంచి కవిత. (పేజీ.37) "బలపం" కవి క్రాంతిదర్శి అనటానికి ఈ క్రింది వాక్యాలే సాక్ష్యాలు.

"ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో నల్లబల్లపైన/ విశ్వరహస్యాలు విప్పిన/ ఐన్‌స్టీన్ సమీకరణం($E=mc^2$) ఈ బలపం రాసిందే!

రాసేటప్పుడు పెద్ద చప్పుడు కాదు/ విప్లవాలు నిశ్శబ్దంగానే వస్తాయి. ..."ఇలా ఈ కవితా సంపుటిలో ఎన్నో వెంటాడే వాక్యాలు... యువతను, పాఠకుల్ని ప్రభావితం చేస్తాయి. మంచి కవితా సంపుటిని తెచ్చిన డా॥ గోపి అభినందనీయులు.

-తంగిరాల చక్రవర్తి

ముఖాముఖి
పరకాల పట్టాభిరామారావు
మొదటిభాగం
వెల : 100-/, పేజీలు : 176
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన్ భవన్, 4-1-435,
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్
మరియు విశాలాంధ్ర
అన్ని పుస్తకషాపులు

ముఖాముఖి
పరకాల పట్టాభిరామారావు
రెండవ భాగం
వెల : 100-/, పేజీలు : 176
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన్ భవన్, 4-1-435,
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్
మరియు విశాలాంధ్ర
అన్ని పుస్తకషాపులు

జ్ఞాపకం

అమృతం ఘాటు



మూడున్నర దశాబ్దాల నాటి మాట. ఎమర్జెన్సీ కాలం. మిత్రుని కలుద్దామని వరంగల్ జిల్లాకు వెళ్లాను. ఎండా కాలం. బస్సు దిగి కిలోమీటరు దూరం నడిచి మిత్రుడున్న గ్రామం చేరాను. దారిలో చెట్లులేవు. ఇంకేం ఎండ ప్రతాపానికి అదిరిపోయాను.

మిత్రుడు వున్న స్థావరం ఆరా తీసి నెమ్మదిగా ఇంట్లో కాలుపెట్టాను. చెమటలు కక్కుతున్న నన్ను చూచి గబగబా వెళ్ళి మజ్జిగ తెచ్చియిచ్చారు. మంచం మీద కూలబడి గ్లాసుడు మజ్జిగ ఒక్క గుక్కలో తాగాను. అమృతం అనిపించింది. ఇంతలో మరొక గ్లాసు ఇచ్చారు. అది కూడా ఖాళీ చేసి మంచం మీద నడుంవాల్చాను. నడుంవాల్చానో లేదో కళ్లు మూతబడ్డాయి.

కొంతసేపటికి మెలకువ వచ్చి లేచి కూర్చున్నాను. ఒక యువకుడు విసనకర్రతో విసురుతుండటం గమనించాను. 'మంచి నీళ్లు తాగుతారా?' అని అడిగాడు. అవునంటూ తల వూపాను.. పెద్ద చెంబూ, గ్లాసుతో తయారు. ముఖం మీద నీళ్లు చల్లుకొని రెండు గ్లాసుల నీళ్లు తాగాను. అప్పటికి ప్రాణం కుదుటపడినట్లయింది.

ఇక తాపీగా వచ్చిన పని చెప్పాను.

'సారుకు కబురు పెట్టాం. వచ్చే వేళయింది. మీరు లేవండి భోంచేతురుగాని' అన్నారు.

'సారును రానీయండి. తొందర ఏంలేదు. ఆయన వచ్చిన తరువాతనే తిందాం' అన్నాను. నా సంచిలోని పత్రిక తీసుకొని చదవడం ప్రారంభించాను.

నేను చదువుతున్న పేజీకి వెనుక భాగం పేజీని యువకుడు దీక్షతో చూస్తున్నాడు. కనిపించిన మేరకు పెద్ద అక్షరాల వార్తలు చదువుతున్నాడు. ఇది గమనించి నేను పేపరు యువకునికి ఇచ్చి చదువుకోమన్నాను. సంతోషంతో అతను తీసుకుని చదువుకోసాగాడు.

బజారులో బూట్ల చప్పుడు వినిపించింది. ఎవరో హడావిడిగా చప్పుడు చేసుకుంటూ నడుస్తున్నారు. నేను వెంటనే జాగ్రత్తపడ్డాను.

'వెళ్తున్నది ఎవరో గమనించు' అన్నాను యువకునితో.

యువకుడు వచ్చి 'ఆ గంజాయి పట్టుకోవటానికి ఫారెస్టు వాళ్లు లేండి' అంటూ తేలికగా చెప్పాడు. అపుడప్పుడు వాళ్లు రావడం పరిపాటే అన్నట్లు చెప్పాడు. నేను ఊపిరిపీల్చుకున్నాను.

ఇంతలో మిత్రుడు రానే వచ్చాడు. కుశల ప్రశ్నలవి జరిగిపోయాయి. 'ప్రయాణం ఎలా సాగింది?' అని అడిగాడు. అనుమానించే వాళ్లు కళ్లబడకుండా జాగ్రత్తగానే వచ్చాను. కాని ఈ గ్రామంలోకి ప్రవేశించటానికే కొద్దిగా ఇబ్బందిపడ్డానని చెప్పాను. 'ఏం జరిగింది? ఎవరన్నా కనిపించి ప్రశ్నలు వేశారా?' అని అడిగాడు ఆదుర్దాగా.

'ఎవరూ కలవలేదు. అడగనూ లేదు. కాని నాకు ముచ్చెమటలు పోశాయి. ఈ కాస్త దూరానికే నోరు పిడచగట్టుకుపోయింది' అన్నా. అతనికి అర్థం కాలేదు. ఇంకా నేను ఏం చెపుతానా అన్నట్లు నావైపే చూస్తున్నాడు.

'సూరయ్య మామ దృష్టిలో పడ్డాను. ఆయన చూపుల నుండి తప్పించుకోలేకపోయాను. దిమ్మదిరిగి పోయింది. ఎండ వేడిమి అలా వుంది. ఉక్కిరి బిక్కిరి అలా చేసింది' అన్నా.

పకపకా నవ్వాడు. 'అదా సంగతీ! మీరు ఎండలో తిరగటం లేదుగా. ఎటుపోయినా చీకటిలోనే గూటికి చేరుతున్నారాయె. ఈ వూరికి బస్సు సౌకర్యం పగటి పూటనే వుంది. అందుకే మీకు ఇబ్బంది కలిగింది' అని చెప్పాడు.

ఇంటి యజమానురాలు వచ్చి, 'ఇంకా ముచ్చట్లలోనే వున్నారా? ఇప్పటికే ఆలస్యమైంది. లేవండి భోంచేతురుగాని' అని తొందరపెట్టింది.

సరేనని మిత్రుడు, నేను లేచి భోజనానికి వెళ్లాం. గృహిణి రెండు కంచాల్లో భోజనం తెచ్చి శ్రద్ధగా మా ముందు పెట్టింది. మిత్రుడు అలవాటున్నట్లుగానే ముద్దలు కలిపి తింటున్నాడు. నేను ఒక ముద్ద తినగానే అదిరిపోయాను. మంట నసాళానికంటింది. గుడ్ల నుండి నీళ్లు జలజల రాలాయి. ఆమె నివ్వెరపోయింది.

విచారపడుతున్నట్లుగా 'అయ్యో కారమెక్కువయిందా! రోచుతున్నారే' అని నొచ్చుకుంటూ అన్నది. పరిస్థితి గమనించాడు మిత్రుడు. ఆమె బాధపడుతున్నది. ముందు ఆమెకు నచ్చచెప్పాలి అనుకున్నట్లుంది.

'కారం ఏంలేదమ్మా. సారుకు అలవాటులేదులే. శాకం అమృతంలాగా వుంది. ఏదీ ఇంకొంచం తీసుకురా' అని అడిగాడు.

అప్పటికి ఆమె ముఖం విప్పారింది. తమ్ముడు మళ్లీ వేయించుకున్నాడని తృప్తిపడింది. కాని నేను ముద్ద ఎత్తలేకపోతున్నానే అని నా వైపు చూసింది.

'అక్కా కొంచెం వెన్నపూస తెచ్చి సారుకు వెయ్యి' అన్నాడు.

లోనికి వెళ్ళింది. ఆమె లోనికి వెళ్లి వచ్చేలోగా ఇక మీవల్లకాదులే అన్నట్లు మిత్రుడు నా కంచంలోని శాకం తన కంచంలో వేసుకున్నాడు. ఆమె వెన్నపూస తెచ్చి నా కంచంలో వేసింది. వెన్నపూస కలుపుకుని నేను ఒక్కొక్క ముద్దే నమలటం చూసి ఆమె తృప్తి పడింది.

తమ్ముడు తృప్తిగా వేసిందంతా లాగేశాడు. అమృతంలా వుందికదా! నాకు గడ్డ పెరుగు తెచ్చి వేసింది. పెరుగు ముద్దలతో నోరు మాములు స్థాయికి వచ్చింది. భోజనాలు ముగిశాయి. పొద్దుపొడవక ముందే తరువాత మజిలీకి చేరాం.

-పర్సా సత్యనారాయణ

చుక్కలు కలిపిస్తే పోలా



ఆ పదాలేవోచ్





జవాబు: constable, diamond

ఏమేం వున్నాయి?

హాయ్ చిన్నారులూ... ఇక్కడో విచిత్రమైన జీవి కనిపిస్తోందా? ఇందులో మనకు బాగా తెలిసిన జంతువులు రెండు వున్నాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.



జవాబు: ఏనుగు, జీబ్రా.

నేర్చుకుందాం



పెరిస్కోప్ కావాలా!







సైనికులు, నావికాదళంలో పనిచేసేవారు పెరిస్కోప్ అనే పరికరాన్ని ఉపయోగిస్తారు. యుద్ధ సమయల్లో భూమిలో గుంతలు తవ్వి (ట్రెంచ్‌లు) లోపల దాక్కునే వారికి పైన ఉపరితలంలో జరిగేవి కనబడవు కదా! వారికోసమే ఈ పెరిస్కోప్. అదేవిధంగా సముద్ర గర్భంలో సంచరించే సబ్‌మెరైన్ గురించి మీకు తెలుసుగా. ఇది కూడా నీటి లోపల తిరుగుతుంటుంది. కాబట్టి దీనిలో ఉండే వారికి నీటి ఉపరితంపై శత్రువుల ఉనికి తెలసుకోవాలంటే పెరిస్కోప్ అవసరం ఉంటుంది. ఇలాంటి పెరిస్కోప్‌ను మనం ఇంట్లోనే తయారు చేయటం ఎలాగో తెలుసుకుందాం.

కావలసిన పరికరాలు

1)దీర్ఘచతురస్రాకారంలో ఉన్న ఖాళీపెట్టె, 2)చతురాస్రాకారంలో ఉన్న రెండు అద్దాలు (ముఖం చూసుకొనే అద్దాలు), 3)కత్తెర, 4) 45 డిగ్రీల కోణంలో రెండు అట్ట ముక్కలు

చేయాల్సిన విధానం

దీర్ఘచతురస్రాకారంలో ఉన్న అట్టపెట్టెను తీసుకొని దాని పైభాగంలో చతురస్రాకారంలో 3వ బొమ్మలో చూపినట్లు చిన్న కంత చేయండి. 45 డిగ్రీల కోణంలో రెండు అట్టముక్కలను తీసుకొని అట్టపెట్ట పైభాగంలో ఒకటి... కింది భాగంలో ఒకటి అంటించండి. ఈ 45 డిగ్రీల అట్టముక్కలపై చతురస్రాకారంలో ఉన్న అద్దాలను (మొదటి అద్దం పాదరసం పూత పైకి ఉండే విధంగా కింది భాగాన అమర్చే అద్దం పాదరసం పూత కిందికి ఉండే విధంగా) అమర్చాలి. కింది అద్దానికి సమాంతరంగా వర్తులాకారంలో ఒక చిన్న రంధ్రం చేయాలి. దీని ద్వారా అద్దంమీద ప్రతిఫలించే దృశ్యాలను కూర్చొని చూడవచ్చు. ఎక్కడైనా పల్లపు ప్రదేశంలో కూర్చొని పెరిస్కోప్‌ను పట్టుకుంటే పైన దృశ్యాలను ఎంచక్కా మనం చూడొచ్చు.

ఇంకెందుకు ఆలస్యం? వెంటనే పెరిస్కోప్ తయారుచేసి శత్రువుల గట్టు రట్టు చేయండి!!



మొత్తం గుర్రాలు ఎన్ని?

పిడుగులూ! మీకు గుర్రపు స్వారీ అంటే చాలా ఇష్టం కదా. మరైతే ఇక్కడ బొమ్మలో ఎన్ని గుర్రాలున్నాయో చెప్పుకోండి చూద్దాం.

నాణేలను చేరాలంటే...



మాటల కోట - 24

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1		■	2	3		■	4	5
	■	6	■		■	7	■	
8	9	■	10			■	11	
■	12		■		■	13		■
14		■	15	■	16	■	17	
■	18		■	19	■	20		■
21		■	22			■	23	24
	■	25	■		■	26	■	
27		■	28			■	29	

అడ్డం :

1. ఐదున్నొక్కటి (2)
2. వసంతం (3)
4. బావి నుంచి నీటిని పైకి తీసేది. కింద నుంచి పైకి కాదు. అటు నుంచి ఇటు (2)
6. తొలిలో తొలి (1)
7. అడ్డం ఆరులో మిగిలింది ఇక్కడ (1)
8. పగలు కాదు. 24 గంటల్లో రెండో సగం (2)
10. రాజకీయ ప్రవేశం చేస్తూనే దీన్ని దక్కించుకోవాలని తహతహ (3)
11. పాండవులకు ముందు నూటొక్క మంది కురచగా (2)
12. పట్టణం, నగరం (2)
13. సేవకుడు, శిష్యుడు, అయితే చిన్న చిక్కేమిటంటే మొదటి దాని తర్వాత ఉండాల్సిన పూర్ణం రెండోదాని పక్కన చేరింది (2)
14. నక్షత్రం (2)
15. 29 అడ్డానికి వ్యతిరేకంలో మొదటిది (1)
16. పై ఆధారంలో మలి సగం (1)
17. విడిది (2)
18. పోట్టి నాయకుడు (2)
20. వాడిని పొమ్మంటూనే రమ్మనండి (2)
21. ఇది ఒక్కటుంటే చాలు డబ్బు తప్పుకోవటమేనని అనుకుంటున్నారు ఇప్పుడు (2)
22. అమ్మనుగన్న అమ్మ (3)
23. సన్నం కాదు పైగా అడ్డం కూడా తిరిగింది (2)
25. ఒకటి అడ్డానికి దీన్ని చేరిస్తే వారు శ్రీశ్రీ మేనల్లుడే (1)
26. 27 అడ్డానికి మహాకవి పిలుపులో సగం చేరిస్తే మనకు ఉత్తరంగా ఉన్న బుల్లి దేశం (1)
27. రావణుడి రాజ్యం (2)
28. మీ వియ్యంకుడి కుమారుడు (3)
29. పిల్లలకు పాపం, ప్రపంచమార్గంతోపాటు ఇది కూడా తెలియదంటాడు శ్రీశ్రీ (2)

నిలువు :

1. బాదరాకు తొలి సగం. గబగబా పనులు చేస్తుంటే ఇలా అంటారు (3)
3. ఏడు దశాబ్దాలుగా పెద్దల్ని అలరిస్తోన్న పిల్లల పత్రిక (4)
5. సమీపంగా చెల్లాచెదురయింది (3)
9. మనం నూరో జయంతి జరుపుకుంటున్న తెలుగు రచయిత గోపీచంద్ ఇంటి పేరు (5)
11. పిల్లల పత్రిక చందమామకు గొప్పపేరు తెచ్చిపెట్టిన సంపాదకుడు (5)
19. ఇంటి నిండా బొమ్మలున్నాయో? అసలు ఇల్లే బొమ్మేమోగానీ ఇది కూడా పిల్లల పత్రికే (4)
21. ఇది వేలాడే పక్షి (3)
24. సౌందర్యం (3)

మాటలకోట - 23 జవాబు

1 వి	ష	2 వృ	క్షం	■	3 ఊ	4 క	దం	5 పు
ష	■	త్తం	■	6 అ	■	సి	■	చ్ఛ
7 నా	రి	■	8 పు	నా	ది	■	9 గు	కా
గు	■	10 ఆ	■	ది	■	11 బ	■	మ
■	12 ఆ	కా	రం	■	13 బే	జా	రు	■
14 క	■	శం	■	15 క	■	రు	■	16 గ
17 లి	జా	■	18 కొ	ల	ను	■	19 బ	డి
ద	■	20 ష్టి	■	హం	■	21 నం	■	యా
22 క	ల్ప	వృ	క్షం	■	23 అం	ధ	రం	రం

గమనిక : గతవారం ప్రచురించిన 'మల్లె మనసు' కథా రచయిత పేరు సాహిత్య ప్రకాష్ అని గమనించగలరు.

ఎడిటర్.

కప్పలు - కోతి


ఓసారి ఒక కోతి నదిలో నీళ్లు తాగుదామని బయలుదేరింది. నది ఒడ్డున కొన్ని కప్పలు కూర్చుని ఎండకాగుతూ కనిపించాయి. వాటిని చూడగానే కోతికి ఓ తుంటరి ఆలోచన వచ్చింది.
హి...హి...ఈ బడాయి కప్పలతో ఒక ఆట ఆడుకుంటాను.
గబగబా కొన్ని రాళ్లు ఏరింది. వాటిని కప్పల మీదికి విసరసాగింది.
హి...హీ...
కోతి విసిరిన రాళ్లు తగిలి రెండు కప్పలు చనిపోయాయి.
అబ్బా...
అ...
ఏయ్...ఆపు! ఆపూ!! ఎందుకు రాళ్లేస్తున్నావ్?
ఎందుకా! నాకు అలా రాళ్లు వేయడం చాలా బావుంది. అందుకని.
నీకు బానేవుంది. కానీ మేం చస్తున్నాం వాటివల్ల.
ఔనా!
నీతి: ఒకరికి ఆనందాన్నిచ్చేది మరొకరికి బాధ కలిగించవచ్చు.



'వాచి'పోయే రేటు

ముంజేతి కంకణానికి అద్దం అక్కర్లేకపోవచ్చు. కాని ముంజేతికున్న ముచ్చటైన వాచీని అద్దంలోకూడా చూసుకొని మురిసిపోయే అధికసంతోషులూ వున్నారండోయ్. ఎవరైనా అలా చేస్తున్నారూ అంటే సదరు చేతి గడియారాలు అంత అందమైనవైనా అయివుండాలి. లేకపోతే అంత ఖరీదైనవైనా అయివుండాలి. ఇక్కడ కనిపిస్తున్నవన్నీ రెండో కోవకు చెందినవే. వాటి రేటు వింటే చాలు వాచిపోద్ది. ఈమాట తమాషాకు చెప్పామనుకుంటున్నారా! కానేకాదు. ఇవి సింపుల్‌గా 1,000,000 డాలర్ల నుంచి 75,000 డాలర్ల వరకు పలుకుతాయి. మరి బంగారం, ప్లాటినంతో చేసిన వజ్రాలు పొదిగిన గడియారాలు ఆ మాత్రం ధర పలకడంలో విచిత్రమేముంది! అన్నట్టు ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన 20 వాచీలలో ఇవీ వున్నాయండోయ్.